www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మత్తు అడ్డాలుగా విద్యాలయాలు

పదకొండేళ్లకే పిల్లల్లో డ్రగ్స్ వినియోగం

- గంజాయి తీసుకుంటున్న మగపిల్లలు
- నల్లమందుకు ఆడపిల్లలు బానిసలు
- అటుగా ఆకర్షిస్తున్న వయసు ప్రభావం
- తేలిగ్గా దొరుకుతుండటమూ కారణమే
- పది నగరాలు.. 5,920 మందిపై అధ్యయనం
- గోప్యంగా సర్వే జరిపిన మెడికల్ బృందాలు
- ప్రతి ఏడు స్కూళ్లలో ఒకచోట డ్రగ్స్ భూతం



2

గురువారం | 11-12-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 339 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి మ.1:57 తదుపరి అష్టమి, నక్షత్రం: పుబ్బ తె.3:56 తదుపరి ఉత్తర, వర్జ్యం: ఉ.11:08-12:48, దుర్ముహూర్తం: ఉ.10:18-11:02, మ.2:42-3:26, అమృతఘడియలు: రా.9:12-10:53, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:38, సూర్యాస్తమయం: 5:37 | కర్నూలు

Kurnool | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పరుగు తీయాలి

మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీలకు సీఎం ఆదేశం

- ఆయా శాఖల పని తీరుపై సుదీర్ఘ సమీక్ష
- ప్రోగ్రెస్ రిపోర్ట్, 'సంతృప్తి' శాతాలతో ప్రజెంటేషన్
- నిర్దిష్ట లక్ష్యాలు విధిస్తూ ఆదేశాలు
- సంక్షేమం, అభివృద్ధి.. రెండూ జరగాల్సిందే
- తగిన విధంగా ఆర్థిక వనరుల సమీకరణ
- 3 నెలల్లో ప్రజల్లో సంతృప్తి 80 శాతం కావాలి
- 15 రోజుల్లో ఫైలు క్లియర్ చేయాల్సిందే
- మంత్రులు, కార్యదర్శులు ప్రజల్లోకి వెళ్లాలి
- జనవరి 15 నుంచి ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే





మంత్రులు, శాఖాధిపతులు, కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వృద్ధి రేటు నుంచి ప్రజల్లో సంతృప్తి దాకా...
ఆన్‌లైన్‌లోనే సేవల నుంచి పెండింగ్ ఫైల్స్ దాకా...
కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల నుంచి ఆయా శాఖల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం దాకా... అనేక అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. బుధవారం సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులు, విభాగాల అధిపతులతో మూడుగంటలకుపైగా సమావేశమయ్యారు. 'మినీ కలెక్టర్ల సదస్సు' తరహాలో జరిగిన ఈ భేటీలో ఆయా శాఖలపై

మిగతా 15వ పేజీలో...

కేంద్ర నిధుల్ని ఖర్చు చేయలేరా?

- మురిగిపోయే పరిస్థితి రానీయొద్దు
- డెడ్‌లైన్ పూర్తవ్వగానే శాఖలకు ఫోన్ చేస్తా
- అప్పటికీ వాడకపోతే మీ జీతాల నుంచి కట్‌చేస్తా
- కార్యదర్శులను హెచ్చరించిన చంద్రబాబు

14

ఫైళ్ల 'పరుగు' ఇలా!

- డోలా, నిమ్మల, ఫరూక్ టాప్
- సీఎం, లోకేశ్‌కు 3 రోజులు
- దుర్గేశ్, సత్యకుమార్ కూడా
- పవన్, కొండపల్లికి 4 రోజులు
- 15 రోజులు తీసుకుంటున్న కొల్లు, రాంప్రసాదరెడ్డి

15

డ్రోన్ సిటీలో పెట్టుబడులు పెట్టండి



గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో లోకేశ్ కరచాలనం

- అసెంబ్లింగ్, టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు చేయండి
- గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌కు లోకేశ్ విజ్ఞప్తి
- విశాఖలో గూగుల్ డేటా సెంటర్ పనులపై చర్చ
- అమెరికాలో ఐటీ దిగ్గజ సంస్థల ప్రతినిధులతో భేటీ
- ఏపీలో ఏటీఎంపీ యూనిట్ ఏర్పాటు చేయండి
- ఇంటెల్ ఐటీ సీటీవో శేష కృష్ణపురతో భేటీలో లోకేశ్
- లోకేశ్ ప్రతిపాదనలకు టెక్ దిగ్గజాల సానుకూలత
- మార్చిలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన
- శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియా కౌన్సిల్ భేటీలో లోకేశ్

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి భారీ పెట్టుబడులు సాధించేందుకు, టెక్నాలజీ పరంగా ఏపీని ప్రగతి పథంలో నడిపేందుకు మంత్రి లోకేశ్ ప్రపంచ దిగ్గజ టెక్ కంపెనీల ముఖ్య ప్రతినిధులతో భేటీ అయ్యారు. అమెరికా, కెనడా పర్యటనలో ఉన్న ఆయన బుధవారం.. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో పాటు ఇంటెల్, ఎన్‌విడియా, అడోబ్, జూమ్ తదితర సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో సుందర్ పిచాయ్‌తో సుమారు 2 గంటలపాటు భేటీ జరిగింది. విశాఖలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు ముందుకు వచ్చినందుకు

మిగతా 13వ పేజీలో...

పల్లెల్లో.. పట్టణ స్థాయి సేవలు



పీఆర్ ఉద్యోగులతో 'మాటామంతి'లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్

సంస్కరణలకు అత్యంత ప్రాధాన్యం

- ప్రధాని, సీఎం నేతృత్వంలో మార్పు.. ప్రజల సంతోషమే ముఖ్యం
- ఉద్యోగులకు పదోన్నతులిచ్చాం.. ఆ మేరకు ఫలితాలూ రావాలి
- వైసీపీ హయాంలో పదోన్నతులు, బదిలీలకూ బేరం పెట్టారు
- ఆర్థికం గాడినపడితే అన్నీ చేస్తాం.. ఉద్యోగినులను వేధించొద్దు
- పంచాయతీరాజ్ 'మాటామంతి'లో డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణాలు, నగరాల్లో అందుతున్న స్థాయిలో అన్ని సేవలూ గ్రామీణ ప్రజలకు చేరువ కావాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. బుధవారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో పంచాయతీరాజ్ ఉద్యోగులతో నిర్వహించిన 'మాటామంతి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీ రాజ్ శాఖలో సంస్కరణలు తీసుకువచ్చామన్నారు. ముఖ్యంగా ఎప్పటి నుంచో పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగులకు అత్యంత పారదర్శకంగా పదోన్నతులు కల్పించామన్నారు. "పదోన్నతులతో మీరు ఎంత సంబరపడ్డారో.. మీరు అందించే సేవల ద్వారా ప్రజలు కూడా అంతే ఆనందపడాలి. ప్రజా సేవలో నిష్పక్షపాతంగా, నిబద్ధతతో పని చేయాలి." అని ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. ఇంజనీరింగ్ విభాగంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్

మిగతా 14వ పేజీలో...

దీపావళికి యునెస్కో గుర్తింపు

ప్రధాని మోదీ, షా హర్షం

2

హెచ్1బీ వీసా ఇంటర్వ్యూలు రద్దు

వివేకా హత్య కేసులో మరింత దర్యాప్తునకు ఓకే!



- పాక్షిక విచారణకు అనుమతించిన నాంపల్లి సీబీఐ కోర్టు
- సునీల్ యాదవ్, కిరణ్ యాదవ్‌తో వైఎస్ ప్రకాశ్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి ఫోన్ సంభాషణలపైనే దర్యాప్తు
- నెల రోజుల్లో పూర్తిచేయాలని సీబీఐకి నిర్దేశం

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మరింత లోతైన దర్యాప్తు చేసేందుకు సీబీఐ కోర్టు పాక్షికంగా అనుమతించింది. ఈ కేసులోని అసలు సూత్రధారులు తప్పించుకోకుండా ఉండాలంటే మరోసారి సమగ్ర దర్యాప్తు చేయాలని గత నెల 21వ తేదీన నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక కోర్టులో వివేకా కుమార్తె సునీతారెడ్డి పిటిషన్ వేయడం తెలిసిందే. దీనిపై విచారించిన న్యాయాధికారి టి.రఘురాం కొన్ని షరతులతో దర్యాప్తు చేసేందుకు అనుమతి ఇస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న సునీల్ యాదవ్, అతడి సోదరుడు కిరణ్ యాదవ్‌తో వైఎస్ ప్రకాశ్‌రెడ్డి, వైసీపీ యువజన విభాగంలో కీలకంగా పని చేసిన ప్రకాశ్‌రెడ్డి మనవడు అర్జున్‌రెడ్డి మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, మెసేజ్‌ల

మిగతా 2వ పేజీలో...





షా X రాహుల్

- ఎన్నికల సంస్కరణలపై పార్లమెంటులో వాడీ వేడి చర్చ
- ఎస్ఐఆర్‌పై అబద్ధాలు ప్రచారం చేస్తున్న ప్రతిపక్షం
- నెహ్రూ నుంచి మన్మోహన్ దాకా ఎస్ఐఆర్ కొనసాగింది
- అప్పుడు ఏ రాజకీయ పార్టీ వ్యతిరేకించలేదు: అమిత్ షా
- నా మీడియా సమావేశాలపై చర్చకు షా సిద్ధమా?: రాహుల్
- తానేం మాట్లాడాలో ప్రతిపక్ష నేత నిర్దేశించలేరన్న షా

2


అంతా కలిసే చేశారు!

- తక్కువ ఖర్చుతో ఎక్కువ సంపాదించాలనే ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ
- జనార్దన్‌రావు పథకానికి జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డి ఓకే
- తంబళ్లపల్లె నియోజకవర్గంలోని 6 మండలాలకు నకిలీ మద్యం
- అన్నీ తెలిసినా మౌనంగా ఉన్నా
- జయచంద్రారెడ్డి సూచన మేరకే నా ఫోన్లు ధ్వంసం
- పీఏ రాజేశ్ వాంగ్మూలం

13

పట్టు కాదు.. పాలిస్టర్

టీటీడీలో వెలుగు చూసిన మరో స్కామ్



- శ్రీవారిని దర్శించే ప్రముఖులు, భక్తులకు కప్పే పట్టు వస్త్రాల కొనుగోళ్లలో కక్కుర్తి
- ధర్మవరం, మైసూరు ల్యాబ్‌ల్లో నిర్ధారణ
- రూ.350 విలువైనది 1,389కు కొనుగోలు
- నగరి వీఆర్ఎస్ ఎక్స్‌పోర్టు నుంచే వేలాదిగా
- ఏసీబీ విచారణకు టీటీడీ లేఖ

తిరుమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో శ్రీవారి ప్రసాదానికి వినియోగించిన నెయ్యి కల్తీ.. పరకామణిలో చోరీ కేసు రాజీ.. చివరికి శ్రీవారిని దర్శించే ప్రముఖులు, భక్తులకు కప్పే పట్టువస్త్రాల కొనుగోలులోనూ దగా.. పట్టు పేరిట పాలిస్టర్ వస్త్రాలు కొనుగోలు చేసి మోసం చేశారు. గత పాలక మండళ్ల హయాంలో

మిగతా 2వ పేజీలో...



కల్తీ నెయ్యిపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదేం?

- టీటీడీ ఛైర్మన్‌కు ఇచ్చిన సమాచారం ఈవోకు ఎందుకు ఇవ్వలేదు?
- తెలిసీ ఎందుకు అనుమతించారు?
- మైసూరు సీఎఫ్‌టీఆర్ఐ రిపోర్టును ఎందుకు తొక్కిపెట్టారు?
- డెయిరీలకు సహకరించకపోతే 3.50 లక్షలు ఎందుకు తీసుకున్నారు?
- సుబ్రహ్మణ్యంపై సిట్ ప్రశ్నల వర్షం

6

ఆ 12 మందిపై ప్రాసిక్యూషన్!

టీటీడీ ఈవో అనుమతి కోరుతూ సిట్ లేఖ

ప్రాయోజిత సంక్షోభం?

ఇండిగో విమానాల రద్దు ఉద్దేశపూర్వకమే కావొచ్చు

- పరిష్కారం కోసం అన్ని కోణాలనూ పరిశీలిస్తున్నాం
- అవసరమైతే ఇండిగో సీఈవోను తొలగిస్తాం
- జరిమానాలు, అత్యంత కఠిన చర్యలు ఉంటాయి
- వారం రోజులుగా సరిగా నిద్రకూడా పోలేదు
- పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు
- బుధవారం 250కుపైగా ఇండిగో సర్వీసులు రద్దు



న్యూఢిల్లీ, డిసెంబరు 10: ఇండిగో సంక్షోభం, భారీగా విమానాల రద్దు ఉద్దేశపూర్వకమే అయి ఉండొచ్చని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. సంక్షోభం ముందు వరకు ఉన్న పరిస్థితి, విమాన సర్వీసుల నిర్వహణ తీరును చూస్తే.. అసలు ఇలా

మిగతా 2వ పేజీలో...



కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయం నడపనున్న భవనం

విశాఖకు ఐటీ జోష్


- రేపు కాగ్నిజెంట్ కార్యకలాపాలు ప్రారంభం
- కాగ్నిజెంట్ శాశ్వత కార్యాలయం, టెక్ తమ్మిన, సత్వ, ఇమ్మాజినోటివ్, ఫ్లూయెంట్ గ్రిడ్ ఐటీ కంపెనీలకు భూమి పూజ కూడా..
- హాజరుకానున్న చంద్రబాబు, లోకేశ్

13

పరకామణిలో చోరీపై చట్టపరంగా చర్యలు

- సీఐడీ, ఏసీబీకి హైకోర్టు ఆదేశం
- డీజీలు ప్రస్తుత దర్యాప్తులను కొనసాగించాలి
- ఆ వివరాలను పరస్పరం పంచుకోవాలి
- ఐటీ, ఈడీలకూ సమాచారమివ్వాలి
- సతీశ్‌కుమార్ పోస్టుమార్టం సర్టిఫికెట్‌ను 3 రోజుల్లో సీల్డ్ కవర్‌లో అందించండి
- సీఐడీకి న్యాయమూర్తి నిర్దేశం

13



స్క్రబ్ టైఫస్‌కు డ్రగ్ రెసిస్టెన్స్ గండం!

- చికిత్సల్లో బలహీనంగా మారుతున్న డాక్సీసైక్లిన్
- అందుకే మరణాలు సంభవిస్తున్నాయనే ఆందోళన
- జినోమ్ సీక్వెన్సింగ్ పరీక్షల పైనే ఆశలు.. రక్త నమూనాలు ఎయిమ్స్, పుణె, వెల్లూరుకు



రోగుల శరీరంపై కనిపించే ఎష్కార్ (నల్ల మచ్చ)

- మరో ముగ్గురికి స్క్రబ్ టైఫస్
- బాధితుల్లో నాలుగేళ్ల చిన్నారి
- వ్యాధి లక్షణాలతో వృద్ధుడి మృతి

గుంటూరు మెడికల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భయపడినట్లే జరుగుతోంది..! రాష్ట్రంలో కలకలం రేపుతున్న 'స్క్రబ్ టైఫస్' కేసుల విషయంలో ఔషధ నిరోధకత ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో నమోదవుతున్న స్క్రబ్ టైఫస్ మరణాలకు ఔషధ నిరోధకత (యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్/ఏఎంఆర్) కారణమని వైద్య వర్గాలు అనుమానిస్తున్నాయి. స్క్రబ్ టైఫస్ చికిత్సకు వినియోగించే ప్రధాన యాంటీ బయోటిక్ మందు డాక్సీ సైక్లిన్. అయితే ప్రస్తుతం ఈ ఔషధం స్క్రబ్ టైఫస్‌పై ఏమాత్రం ప్రభావం చూపలేకపోతోంది. గతేడాది వేల సంఖ్యలో స్క్రబ్ టైఫస్ కేసులు నమోదైనా మరణాలు అత్యల్పంగానే ఉన్నాయి. ఈ ఏడాది కేసుల సంఖ్య తక్కువగా ఉన్నా మరణాల సంఖ్య పెరిగింది. దీనికి

మిగతా 2వ పేజీలో...

నోరు జాగ్రత్త!

- కర్ణాటక శాసన సభలో ద్వేషపూరిత వ్యాఖ్యల వ్యతిరేక బిల్లు
- కులం, ధార్మిక అంశాలపై ఇతరులకు బాధ కలిగించేలా మాట్లాడితే జైలే
- సంజ్ఞలు, రాతలు కూడా ద్వేషపూరిత వ్యాఖ్యలుగా పరిగణన

2

పిల్లనిస్తామని ఇంటికి పిలిచి.. చంపేశారు



శ్రవణ్‌సాయి

- యువతి ప్రేమికుడి పట్ల ఆమె తల్లిదండ్రుల ఘాతుకం
- తలపై బ్యాట్‌తో కొట్టి హత్య
- హైదరాబాద్‌లో ఘోరం

14

బ్యాంకర్లనే బురిడీ కొట్టిద్దామని..

నకిలీ బంగారంతో ఎస్‌బీఐకి వచ్చిన కర్ణాటక ముఠా

14

- స్థానిక రైతులకు కమీషన్ ఆశ చూపి.. పాసుపుస్తకాలపై రుణానికి యత్నం
- అనుమానంతో ఆరా తీసిన బ్యాంకర్లు
- వెంటనే పోలీసులకు సమాచారం
- సత్యసాయి జిల్లాలో ఏడుగురు అరెస్టు!

భర్తను హత్య చేసిన భార్య

ఫోన్ మాట్లాడొద్దంటే.. గొడ్డలితో కొట్టింది

- ఫోన్ మాయలో పడి ఇంటిపనులు చేయట్లేదని భర్త తిట్టడంతో దాడి
- అల్లూరి జిల్లా చింతపల్లిలో ఘటన

13

సీఐసీ నియామకాలపై రాహుల్ అసమ్మతి నోట్

- నియామకాలపై ఎటూ తేల్చని కమిటీ భేటీ!
- కేంద్రం ప్రతిపాదించిన పేర్లపై రాహుల్‌గాంధీ అసంతృప్తి
- భేటీలో పాల్గొన్న ప్రధాని, హోంమంత్రి
- ముఖ్య సమాచార కమిషనర్‌తోపాటు 8 మంది కమిషనర్ల.. పోస్టులు ఖాళీ
- పెండింగ్‌లో 30,000కు పైగా కేసులు!

2

దీపావళికి యునెస్కో గుర్తింపు

న్యూఢిల్లీ, డిసెంబరు 10: వయస్సుతో సంబంధం లేకుండా కోట్లాది మంది ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకొనే పండుగ దీపావళి. యునెస్కో గుర్తింపుతో ఆ పండుగకు అంతర్జాతీయ ఖ్యాతి దక్కింది. ఢిల్లీ ఎర్రకోట వేదికగా యునెస్కో కీలక సమావేశం జరుగుతోంది. ఇన్‌టాంజబుల్ కల్చరల్ హెరిటేజ్ (ఐసీహెచ్)ని సంరక్షించడమే ధ్యేయంగా అంతర్ ప్రభుత్వ కమిటీ ఎప్పటికప్పుడు సమావేశమవుతూ ఉంటుంది. భారతదేశం తొలిసారిగా ఈ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చింది. ఈ నెల 8న ప్రారంభమై.. 13వ తేదీ వరకు జరిగే ఈ సమావేశాల్లో 80 దేశాల నుంచి వచ్చిన 67 ప్రతిపాదనలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. దీపావళికి యునెస్కో గుర్తింపు ఇస్తూ బుధవారం ప్రకటన వెలువడగానే దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమయింది.

ఎఫ్-35 కావాలంటే ఎస్-400 వదులుకోండి

» టర్కీకి తేల్చి చెప్పిన అమెరికా

వాషింగ్టన్, డిసెంబరు 10: ఎఫ్-35 యుద్ధ విమానాలు కొనాలనుకుంటే రష్యాతో చేసుకున్న ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ కొనుగోలు ఒప్పందం రద్దు చేసుకోవాలని టర్కీకి అమెరికా తేల్చి చెప్పింది. దీనికి సంబంధించి అధ్యక్షుడు ట్రంప్‌తో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగెన్ కొన్ని నెలలుగా చర్చలు జరుపుతున్నారని అమెరికా రాయబారి బరాక్ వెల్లడించారు. అమెరికా చట్టాల ప్రకారం టర్కీ తాము చెప్పినట్లు వింటేనే ఎఫ్-35 కొనుగోళ్లకు అనుమతిస్తామని ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. వాస్తవానికి అమెరికా నుంచి వంద ఎఫ్-35 యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలని టర్కీ యోచిస్తోంది.

పట్టు కాదు.. పాలిస్టర్

(మొదటి పేజీ తరువాయి)

వెంకన్నను, భక్తులను అందరినీ మోసం చేశారు. అక్రమాలు బయటపడుతూనే ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సిల్క్ పేరుతో పాలిస్టర్ వస్త్రాలను సరఫరా చేసి భారీగా అవినీతికి పాల్పడినట్లు తాజాగా తేలింది. వ్యక్తిగత వినియోగం కోసం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఇటీవల కొన్ని పట్టువస్త్రాలను కొనుగోలు చేయగా కేవలం రూ.350 ధరకే లభించాయి. అయితే టీటీడీ కొనుగోలు చేస్తున్న పట్టు వస్త్రాలు మాత్రం రూ.వెయ్యికి పైనే ధర ఉన్నాయి. దీంతో 30 రోజుల్లో విచారణ చేపట్టి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. సెప్టెంబరు 16వ తేదీన జరిగిన బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా శ్రీవారిని దర్శించుకునే ప్రముఖులకు రంగనాయక మండపంలో పట్టువస్త్రాలు కప్పి ఆశీర్వచనం చేస్తారు. అలాగే వేదాశీర్వచనం టికెట్ కొనే భక్తులకూ ఈ వస్త్రాలు కప్పడం ఆనవాయితీ. టెండర్ల నిబంధనల ప్రకారం.. ఈ వస్త్రాలు స్వచ్ఛమైన మల్బరీ సిల్క్‌తోనే నేయాలి. అలాగే డెనియర్ పత్తిదారంతో కనీసం 31.5 డెనియర్ కౌంట్ రావాలి. ఇక ప్రతి వస్త్రంపై ఓ వైపు 'ఓం నమో వేంకటేశాయ' అని సంస్కృతంలో, మరోవైపు తెలుగులో ఉండాలి. అలాగే శంఖు, చక్ర నామాలను ఉంచాలి. ఓ మీటరు వెడల్పు, 2.3 మీటర్ల పొడవుతో తప్పనిసరిగా సిల్క్ మార్క్ హాలోగ్రామ్ ట్యాగ్ ఉండాలి. బోర్డు ఆదేశాల మేరకు.. విజిలెన్స్ విభాగం ఇటీవల తిరుపతిలో మార్కెటింగ్ విభాగంలో నూతన స్టాక్ నుంచి, తిరుమలలోని వైభోత్సవ మండపం నుంచి రెండేసి చొప్పున శాంపిల్స్‌ను సేకరించింది. ఇందులో ఒక్కొక్కటి చొప్పున రెండేసి ధర్మవరంలోని సెంట్రల్ సిల్క్ బోర్డుకు, బెంగళూరులోని సెంట్రల్ సిల్క్ బోర్డుకు పంపారు. రెండు ల్యాబ్‌ల నుంచి వచ్చిన రిపోర్టుల్లో పాలిస్టర్ వర్సెస్ పాలిస్టర్‌గా ఉండటంతో అధికారులు షాకయ్యారు. టీటీడీ నిబంధనల ప్రకారం సిల్క్ వర్సెస్ సిల్క్‌లో ఈ వస్త్రాలు ఉండాలి. అలాగే వస్త్రాలపై సిల్క్‌మార్క్ హాలోగ్రామ్ కూడా లేనట్టు తేలింది.

ఒకే సంస్థ నుంచి వేలాది వస్త్రాలు

తిరుపతి, తిరుమలలో విజిలెన్స్ విభాగం సేకరించిన వస్త్రాలన్నీ నగరికి చెందిన వీఆర్ఎస్ ఎక్స్‌పోర్టు అనే సంస్థ సరఫరా చేసినట్టు గుర్తించారు. ఈ సంస్థకు అనుబంధంగా ఉన్న తిరుమల ఫ్యాబ్రిక్స్, నాన్న కాటేజెస్, వీఎం రాజ పవర్‌లూమ్ వంటి అనేక సంస్థలు కూడా ఉండటం గమనార్హం. 2015-25 మధ్య వీటి నుంచి మొత్తం రూ.54.95 కోట్ల విలువైన వస్త్రాలు కొనుగోలు చేసినట్టు ఉన్న రికార్డులను కూడా స్వాధీనం చేసుకున్నారు. అయితే గతంలో తిరుపతి మార్కెటింగ్ విభాగం పంపిన నమూనాలకు కాంచీపురం సీఎస్‌బీలో ఆమోదం లభించడంపై పలు రకాల అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అదే స్టాక్ నుంచి విజిలెన్స్ సేకరించిన నమూనాలు మాత్రం ధర్మవరం, బెంగళూరు ల్యాబ్‌ల్లో పాలిస్టర్‌గా రిపోర్టులు రావడం, కాంచీపురంలో ఆమోదం రావడంతో అక్రమాలు జరిగినట్టు టీటీడీ భావిస్తోంది. నమూనాలను మార్చడం లేదా ల్యాబ్‌లో మేనేజ్ చేసి ఉండవచ్చనే అనుమానాలను విజిలెన్స్ విభాగం కూడా వ్యక్తం చేసింది. తాజాగా మరో 15 వేల వస్త్రాల కోసం రూ.1,389 చొప్పున సరఫరా చేసేందుకు ఇదే సంస్థ కాంట్రాక్ట్ తీసుకుంది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఆ సంస్థకు కేటాయించిన కాంట్రాక్ట్‌ను టీటీడీ రద్దు చేసింది.

ఏసీబీ విచారణకు ఈవో లేఖ.. విజిలెన్స్ నివేదిక ఆధారంగా అవకతవకలు జరిగినట్టు నిర్ధారించుకున్న టీటీడీ అక్టోబరు 28వ తేదీన జరిగిన బోర్డు సమావేశంలో సుదీర్ఘంగా చర్చించింది. 2015 నుంచి 2025 వరకు జరిగిన వస్త్రాల కొనుగోలు అంశంపై ఏసీబీ ద్వారా సమగ్ర విచారణ చేయించాలని బోర్డు తీర్మానం చేసింది. బోర్డు తీర్మానం ప్రకారం టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఇటీవల సమగ్ర విచారణ కోసం ఏసీబీకి లేఖ రాశారు. ఇదే అంశంపై చైర్మన్ బీఆర్ నాయుడు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. 'నాకు రూ.350కి వస్త్రాన్ని విక్రయించిన సంస్థే టీటీడీకి రూ.1,389కి విక్రయిస్తోంది. అక్కడే అనుమానం కలిగి విచారణ చేయించాం. స్వామి సొమ్మును ఇష్టమొచ్చినట్లు తిన్నారు. దేవుడు క్షమించడు. వాళ్లకు రోజులు దగ్గర పడ్డాయి. టీటీడీలో పూర్తిస్థాయిలో అవినీతి అక్రమాలను అడ్డుకోవడంతో పాటు గతంలో జరిగి అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చి దొంగలకు శిక్ష వేయిస్తాం' అని అన్నారు.

వివేకా హత్య కేసులో మరింత దర్యాప్తునకు ఓకే!

(మొదటి పేజీ తరువాయి)

డేటా ఆధారంగా నెల రోజుల లోపు విచారణ చేయాలని ఆదేశించింది. తన తండ్రి హత్య కేసులో లోతైన దర్యాప్తు చేయాలని సునీతా రెడ్డి వేసిన పిటిషన్‌కు మద్దతుగా సునీల్ యాదవ్ కౌంటర్ దాఖలు చేయడం తెలిసిందే. పలు అంశాలపై సీబీఐ దర్యాప్తు అసమగ్రంగా ఉందని నిందితుల్లోనే కొందరు ప్రస్తావించడం, కోర్టు ఆదేశిస్తే దర్యాప్తు చేయడానికి సిద్ధంగా ఉన్నామని సీబీఐ సంసిద్ధత వ్యక్తం చేయడం, చట్టపరంగా దర్యాప్తు కొనసాగించడానికి అడ్డంకులు లేకపోవడంతో.. పాక్షిక విచారణకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. కాల్ రికార్డ్స్ డేటా ఆధారంగా దర్యాప్తు జరపాలని ఆదేశించింది.

ప్రాయోజిత సంక్షోభం?

(మొదటి పేజీ తరువాయి)





జరిగి ఉండాల్సిందే కాదని చెప్పారు. అవసరమైతే ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్‌ను తొలగించేందుకు, భారీగా జరిమానాలు విధించేందుకు కూడా సిద్ధమని తెలిపారు. ఇండిగోపై కఠిన చర్యలు చేపడతామని, భవిష్యత్తులో విమానయాన శాఖను ఎవరూ తేలికగా తీసుకోలేని స్థాయిలో ఈ చర్యలు ఉంటాయని చెప్పారు. బుధవారం టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రామ్మోహన్‌నాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇండిగో సంక్షోభం వెనుక ఏదో ఉద్దేశపూర్వక అంశం ఉన్నట్టు కనిపిస్తోంది. వారి నిర్వహణ తీరు, సర్వీసులపై వారికి ఉన్న పట్టును బట్టి చూస్తే.. ఈ సంక్షోభం ఏర్పడి ఉండకూడదు. అంతేకాదు ప్రత్యేకంగా ఆ సమయంలోనే సమస్య ఎందుకు మొదలైంది. అది ఎలా సంక్షోభానికి దారితీసిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి" అని కేంద్ర మంత్రి చెప్పారు. ఈ అంశాలన్నింటిపైనా లోతుగా విచారణ సాగుతోందని వెల్లడించారు. ఇక ఇండిగో సీఈవోను తొలగించవచ్చనే ప్రచారం జరుగుతున్న విషయాన్ని ప్రస్తావించగా.. "ఒకవేళ అవసరమైతే కచ్చితంగా తొలగిస్తాం. అంతేకాదు విధించేందుకు అవకాశమున్న అన్ని జరిమానాలు వేస్తాం. ఇండిగో సంక్షోభానికి సంబంధించి అన్ని కోణాలనూ పరిశీలిస్తున్నాను. గత ఏడు రోజులుగా నేను సరిగా నిద్ర కూడా పోలేదు. చాలా సేపు ఆఫీసులోనే ఉండి పరిస్థితులను సమీక్షిస్తూనే ఉన్నాను.." అని రామ్మోహన్ నాయుడు చెప్పారు. విమానయాన సంస్థలు, ఇతర భాగస్వామ్య పక్షాలతో విస్తృతంగా చర్చించిన తర్వాతే 'విమాన విధుల సమయ పరిమితి (ఎఫ్‌డీటీఎల్)' నిబంధనలను అమల్లోకి తెచ్చామని స్పష్టం చేశారు. విమానయాన శాఖ మంత్రిగా ఈ రంగాన్ని వేగంగా అభివృద్ధిలోకి తీసుకెళ్లడం తన బాధ్యత అని, ఈ క్రమంలో ఏర్పడే ఇండిగో సంక్షోభం వంటివి ఆ బాధ్యతను మరింత పెంచుతాయని చెప్పారు. సంక్షోభం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులకు క్షమాపణలు తెలిపారు.

సీఈవో, ఉన్నతాధికారులకు డీజీసీఏ పిలుపు

విమానయాన సంక్షోభం నేపథ్యంలో ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్, వివిధ విభాగాల ఉన్నతాధికారులను తమ ముందు హాజరుకావాల్సిందిగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆదేశించింది. విమానాల రద్దు, సర్వీసుల పునరుద్ధరణ, పైలట్లు, ఇతర సిబ్బంది సంఖ్య, కొత్తగా నియామకాల కోసం చేస్తున్న ఏర్పాట్లు సహా అన్ని వివరాలతో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రావాలని స్పష్టం చేసింది. ఇక ఇండిగో సంస్థ రోజువారీ వ్యవహారాలను పరిశీలించడానికి డీజీసీఏ 8 మందితో పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేసింది. అందులో ఇద్దరు అధికారులు ఇండిగో కార్పొరేట్ కార్యాలయంలో రోజువారీ వ్యవహారాలను, విమాన సర్వీసుల నిర్వహణ, రద్దు, రీఫండ్లు, ఇతర అంశాలను పరిశీలిస్తారని తెలిపింది.

సంక్షోభ పరిష్కారం సరే.. ముందేం చేశారు?: హైకోర్టు

పెద్ద సంఖ్యలో ఇండిగో విమానాల రద్దు సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం మంచి చర్యలే చేపట్టిందని.. కానీ అసలు ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది, అప్పటివరకు ప్రభుత్వం ఏం చేస్తోందని ఢిల్లీ హైకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. ఒకవైపు సంక్షోభం కొనసాగుతుంటే.. మరోవైపు ఇతర విమానయాన సంస్థలు భారీగా చార్జీలు పెంచేయడాన్ని ఎలా అనుమతించారని నిలదీసింది. ఇండిగో సంక్షోభం నేపథ్యంలో ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేలా, టికెట్ చార్జీలు పూర్తిగా రీఫండ్ చేయించేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై చీఫ్ జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్‌రావుల ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. అనూహ్యమైన పరిస్థితులతోపాటు మరికొన్ని అంశాలు విమానాల రద్దుకు కారణమయ్యాయని.. అయితే ప్రయాణికుల ఇబ్బందులను తొలగించడానికి పౌర విమానయాన శాఖ, డీజీసీఏ పకడ్బందీ చర్యలు చేపట్టాయని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనానికి వివరించారు. కానీ దీనిపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. "సంక్షోభం నెలకొన్న సమయంలో ఇతర విమానయాన సంస్థలు భారీగా ధరలు పెంచుకునేందుకు ఎలా అనుమతించారు? సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని కేంద్రాన్ని ఆదేశించింది. విచారణను జనవరి 22వ తేదీకి వాయిదా వేసింది.

11 విమానాశ్రయాల్లో డీజీసీఏ తనిఖీలు

ఇండిగో సంక్షోభం 9వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా 11 ప్రధాన విమానాశ్రయాల్లో తనిఖీలు నిర్వహించాలని డీజీసీఏ నిర్ణయించింది. విమానాల రద్దు, ఆలస్యం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, ప్రయాణికుల రద్దీ, వారికి అవసరమైన సౌకర్యాలు, విమానయాన సంస్థలు, విమానాశ్రయ నిర్వహణ సంస్థల సిబ్బంది సరిపడా ఉన్నారా? అనేది పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. ప్రయాణికులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకోవాలని సూచించింది. గురువారం సాయంత్రానికల్లా నివేదికలు ఇవ్వాలని పేర్కొంది. కాగా, బుధవారం దేశవ్యాప్తంగా 250కి పైగా ఇండిగో సర్వీసులు రద్దయ్యాయి. అందులో ఢిల్లీ, బెంగళూరుల నుంచే సగం సర్వీసులు ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

షా ✗ రాహుల్

» ఎన్నికల సంస్కరణలపై పార్లమెంటులో వాడీ వేడి చర్చ





న్యూఢిల్లీ, డిసెంబరు 10: పార్లమెంటులో బుధవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మధ్య మాటల తూటాలు పేలాయి. ఎన్నికల సంస్కరణలపై చర్చలో భాగంగా పరస్పర సవాళ్లు చోటుచేసుకున్నాయి. ఎన్నికల కమిషన్ సహకారంతో బీజేపీ ఓటు చోరీకి పాల్పడుతోందంటూ రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలపై అమిత్‌షా తీవ్రంగా స్పందించారు. ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షం అబద్ధాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ప్రధానిగా, ముఖ్యమంత్రిగా ఎవరుండాలన్నది చొరబాటుదారులు నిర్ణయిస్తే ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉంటుందా? అని ప్రశ్నించారు. గత చరిత్రను ప్రస్తావిస్తే ప్రతిపక్షానికి కోపం వస్తుందని, కానీ.. ఏ దేశమైనా, సమాజమైనా చరిత్రను విస్మరించి ముందుకు ఎలా సాగుతుందని అన్నారు. "నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో 1952, 1957, 1961లో ఎస్ఐఆర్ చేపట్టారు. ఆపై లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల హయాంలోనూ ఎస్ఐఆర్ చేపట్టారు. అనంతరం వాజపేయి, మన్మోహన్ సింగ్‌ల హయాంలోనూ జరిగింది. ఆయా సందర్భాల్లో ఏ రాజకీయ పార్టీ కూడా దీనిని వ్యతిరేకించలేదు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, ప్రజాస్వామ్యం ఆరోగ్యకరంగా ఉండాలని కోరుకోవడమే ఇందుకు కారణం" అని అమిత్ షా అన్నారు. గత నాలుగు నెలలుగా ప్రజలను ఎస్ఐఆర్‌పై తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆక్షేపించారు. దీనిపై రాహుల్ స్పందిస్తూ.. గత మూడు మీడియా సమావేశాల్లో తాను మాట్లాడిన అంశాలపై చర్చించేందుకు సిద్ధమా? అంటూ అమిత్‌షాకు సవాల్ విసిరారు. తాను ప్రస్తావించిన అంశంపై హోంమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే తాను ఏం మాట్లాడాలన్నది ప్రతిపక్ష నేత నిర్దేశించలేరంటూ అమిత్‌షా ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా ఎస్ఐఆర్ అనేది దొడ్డిదారిలో ఎన్ఆర్‌సీని అమలు చేయడమేనని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. మత ప్రాతిపదికన ఎంపిక చేసుకున్న ప్రజల ఓటుహక్కును తొలగించేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరితమైన ప్రక్రియ అని అన్నారు.

సీఐసీ నియామకాలపై రాహుల్ అసమ్మతి నోట్

న్యూఢిల్లీ, డిసెంబరు 10 : కేంద్ర సమాచార కమిషనర్ల నియామకంపై బుధవారం ఏర్పాటైన కేంద్ర కమిటీ సమావేశం ఏ నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. కేంద్ర సమాచార కమిషన్లో ఖాళీగా ఉన్న ముఖ్య సమాచార కమిషనర్(సీఐసీ) పోస్టుతోపాటు మరో 8 మంది కమిషనర్లు, ఒక విజిలెన్స్ కమిషన్ సభ్యుడిని ఈ కమిటీ నియమించాల్సి ఉంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సభ్యులుగా ఉన్న ఈ కమిటీ బుధవారం పార్లమెంటులోని ప్రధాని చాంబర్‌లో భేటీ అయ్యింది. దాదాపు గంటన్నర సాగిన వారి సమావేశం సమాచార కమిషనర్ల నియామకంపై ఎటూ తేల్చకుండానే ముగిసింది. నియామకాలపై రాహుల్ గాంధీ తన అసమ్మతి నోట్‌ని ఇచ్చినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. కాగా ప్రధాని నేతృత్వంలోని సమాచార కమిషనర్ల నియామక కమిటీ ఈ నెల 10న సమావేశమై నియామకాలపై నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర ప్రభుత్వం ఈ నెల 1నే సుప్రీంకోర్టుకు తెలియజేసింది. కాగా కాంగ్రెస్ గతంలోనూ(2020) సీఐసీ నియామక ప్రక్రియను తప్పుబట్టింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఈ ప్రక్రియ చేపడుతున్నారని ఆరోపించింది. కేంద్ర సమాచార కమిషన్ వద్ద ప్రస్తుతం 30,838 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా, సీఐసీ నియామకంపై ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ 88 నిమిషాలపాటు భేటీ కావడంపై పార్లమెంటు కారిడార్‌లలో ఎంపీల మధ్య పెద్ద ఎత్తున చర్చ సాగింది. రాహుల్‌గాంధీ బయటకు వచ్చాకగానీ.. వారికి ఈ సమావేశం కేవలం సీఐసీ నియామకంపైనే కాదని, మరో 8 మంది సమాచార కమిషనర్లతోపాటు ఒక విజిలెన్స్ కమిషనర్ నియామకంపై జరిగిందన్న విషయం తెలియలేదు. ఆనియామకాలపై రాహుల్ అభ్యంతరం తెలిపారు.

మత్తు అడ్డాలుగా విద్యాలయాలు


» పదకొండేళ్లకే పిల్లల్లో డ్రగ్స్ వినియోగం

» గోప్యంగా సర్వే జరిపిన మెడికల్ బృందాలు

» ప్రతి ఏడు స్కూళ్లలో ఒకచోట డ్రగ్స్ భూతం

న్యూఢిల్లీ, డిసెంబరు 10: జ్ఞాన వనాలుగా ఉండాల్సిన విద్యాలయాలు గంజాయి వనాలుగా మారుతున్నాయని ఓ అధ్యయనంలో తేలింది. స్కూలుకు వెళ్లే పిల్లలు 12.9 ఏళ్లకే మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, కొందరైతే పదకొండేళ్లు వచ్చేటప్పటికే మత్తుకు బానిసలు అవుతున్నారంటూ ఈ అధ్యయనం మన విద్యావ్యవస్థపై ప్రమాద ఘంటికలు మోగించింది. హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, ముంబై, లఖ్‌నవూ, చండీగఢ్, ఇంఫాల్, జమ్మూ, దిబ్రూగఢ్, రాంచీ నగరాల పరిధిలో సగటున 14.7 ఏళ్ల వయసు కలిగిన 5,920 మంది విద్యార్థులపై గోప్య పద్ధతిలో ఈ అధ్యయనం సాగింది. దానిని నివేదిక రూపంలో నేషనల్ మెడికల్ జర్నల్ ఆఫ్ ఇండియాలో ప్రచురించారు. 'మీరు డ్రగ్స్ తీసుకుంటారా' అని బహిరంగంగా మమ్మల్ని అడిగితే లేదనే మేం సమాధానం చెబుతాం' అని తాము కలిసిన విద్యార్థుల్లో ఎక్కువమంది తెలిపారని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన ఢిల్లీ, ఎయిమ్స్‌లోని నేషనల్ డ్రగ్ డిపెండెన్స్ ట్రీట్‌మెంట్ సెంటర్ అధిపతి డాక్టర్ అంజూ ధావన్ తెలిపారు. చండీగఢ్, దిబ్రూగఢ్, లఖ్‌నవూ, బెంగళూరు, శ్రీనగర్, ఇంఫాల్, ముంబై, హైదరాబాద్, రాంచీలకు చెందిన వైద్య కళాశాలలకు చెందిక బృందాలు ఈ అధ్యయనంలో పాలుపంచుకున్నాయి. అధ్యయనం జరిపిన ప్రతి ఏడు స్కూళ్లలో కనీసం ఒకచోట విద్యార్థులు కనీసం ఒక్కసారైనా తాము డ్రగ్స్ తీసుకున్నట్టు తెలిపారు. మగపిల్లలు పొగాకు ఉత్పత్తులు, గంజాయి అధికంగా తీసుకుంటే, ఆడపిల్లలు నల్ల మందు గోలీలు, ఇతర మాదక ద్రవ్యాలు ఎక్కువగా వాడుతున్నారు.

లోకం తీరు



నోరు జాగ్రత్త!

» కర్ణాటక శాసన సభలో ద్వేషపూరిత వ్యాఖ్యల వ్యతిరేక బిల్లు

» కులం, ధార్మిక అంశాలపై ఇతరులకు బాధ కలిగించేలా మాట్లాడితే జైలే

బెంగళూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ఇకపై నలుగురిలో మాట్లాడేటప్పుడు నోరు అదుపులో ఉంచుకోవాల్సిందే. ద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తే జైలుకు వెళ్లాల్సి రావచ్చు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. శాసనసభ శీతాకాల సమావేశాలల్లో ద్వేషపూరిత వ్యాఖ్యల వ్యతిరేక బిల్లును బుధవారం ప్రవేశపెట్టింది. కులం, సమాజం, లింగ, లైంగిక, జన్మస్థలం, ధార్మిక అంశాలను ప్రస్తావిస్తూ.. ఇతరులకు బాధ కలిగించేలా వ్యాఖ్యలు చేస్తే జరిమానా, జైలు శిక్ష విధించాలన్నది ఈ బిల్లు ఉద్దేశం. ఈ బిల్లును ఈ నెల 4న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన ఈ బిల్లును హోం శాఖ మంత్రి పరమేశ్వర సభలో ప్రవేశపెట్టారు. ఈ సమయంలో స్పీకర్ యూటీ ఖాదర్ మూజువాణి ఓటింగ్‌కు అనుమతించగా, ప్రతిపక్ష బీజేపీ సభ్యులు వ్యతిరేకిస్తూ డివిజన్‌కు పట్టుబట్టారు. అయితే స్పీకర్ బిల్లులను సభలో ప్రవేశపెట్టేందుకు అనుమతించారు. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే.. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తి లేదా సమూహం లేదా మరణించిన వారిపై ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు, సంజ్ఞలు, రాతలు, దృశ్య, ఎలక్ట్రానిక్ సమాచార వ్యవస్థల ద్వారా చేసే దుష్ప్రచారం చేసే ప్రతి చర్యను ద్వేషపూరిత వ్యాఖ్యలుగా పరిగణిస్తారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసినవారికి తొలిసారి ఏడాది నుంచి ఏడేళ్లపాటు జైలు శిక్షతో పాటు రూ.50 వేలు జరిమానా విధిస్తారు. పునరావృతమైతే రెండేళ్ల నుంచి పదేళ్ల వరకు జైలుశిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తారు. ఈ నేరాలను నాన్‌బెయిలబుల్ కేసులుగా పరిగణిస్తారు. ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులోనే శిక్షలు విధించేలా బిల్లును రూపొందించి, శాసనసభలో ప్రవేశపెట్టారు. పరిషత్ ముందుకు ఈ బిల్లు గురువారం వచ్చే అవకాశం ఉంది. కాగా.. బిల్లు సభలో ప్రవేశపెట్టడంపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అజెండాలో ద్వేషపూరిత వ్యాఖ్యల వ్యతిరేక బిల్లు భాగమని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్వేష పూరిత వ్యాఖ్యలను అంగీకరించబోమని స్పష్టంచేశారు.

హెచ్1బీ వీసా ఇంటర్వ్యూలు రద్దు

వాషింగ్టన్, డిసెంబరు 10: హెచ్1బీ వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాల పరిశీలన తప్పనిసరి చేయడంతో పెద్ద సంఖ్యలో వీసా ఇంటర్వ్యూలు రద్దయ్యాయి. ఇది అనేకమంది ప్రయాణ ప్రణాళికలను దెబ్బకొట్టింది. ఈనెల 15 నుంచి ఈ కొత్త నిబంధన అమల్లోకి రానున్న నేపథ్యంలో హెచ్1బీ వర్కర్లు, వారి కుటుంబసభ్యుల్లో అనిశ్చితి నెలకొంది. ట్రంప్ సర్కారు తీసుకొచ్చిన ఈ కొత్త నిబంధన వల్ల పెద్ద సంఖ్యలో వీసా ఇంటర్వ్యూలు రీషెడ్యూల్ అవుతున్నాయి. దీంతో అనేకమంది దరఖాస్తుదారుల ప్రయాణాలు హఠాత్తుగా రద్దవుతున్నాయి. ఈనెల మధ్య నుంచి నెలాఖరు వరకు నిర్వహించాల్సిన ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లను హైదరాబాద్, చెన్నై సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కాన్సులేట్లు రద్దు చేశాయని ఇమ్మిగ్రేషన్ లాయర్లు తెలిపారు. వీటిలో అనేక స్లాట్లను వచ్చే ఏడాది మార్చికి వాయిదా వేయడంతో వారి ప్రయాణ ప్రణాళికలను మార్చుకోవాల్సి వస్తోంది. అయితే, తాజా నిబంధన నేపథ్యంలో రోజువారీ ఇంటర్వ్యూల సంఖ్యను కాన్సులేట్లు తగ్గిస్తున్నాయి. దీనివల్ల అనేకమంది ఇంటర్వ్యూలు రద్దవుతున్నాయి. వీసా రద్దయినవారిలో 8 వేలమందికిపైగా విద్యార్థులు ఉన్నారని అమెరికా విదేశాంగశాఖ సీనియర్ అధికారి తెలిపారు. రద్దైన వీసాల్లో దాదాపు సగం.. మద్యం మత్తులో వాహనం నడపడం, చోరీ, దాడి తదితర కారణాలతోనే రద్దయ్యాయన్నారు. ఉగ్రవాదాన్ని సమర్థించడం వంటి తీవ్రమైన కారణాలు, గడువు ముగియడం వంటి పరిపాలనాపరమైన కారణాల వల్ల కూడా వీసాలు రద్దు చేశామని అంతకుముందు మీడియాకు విదేశాంగశాఖ వెల్లడించింది.

స్క్రబ్ టైఫస్‌కు డ్రగ్ రెసిస్టెన్స్ గండం!



స్క్రబ్ టైఫస్‌పై సమీక్ష నిర్వహిస్తున్న గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కారణం వ్యాధి కారక క్రిములు ఔషధాల ప్రభావాన్ని తట్టుకునే శక్తిని సంతరించుకోవడంతో పాటు బ్యాక్టీరియా ఉత్పరివర్తనాలే కారణమని వైద్య వర్గాలు అనుమానిస్తున్నాయి. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో స్క్రబ్ టైఫస్ రోగులకు ఐవీ ఫ్లూయిడ్స్‌తో పాటు డాక్సీసైక్లిన్ మందు ఇస్తున్నా జ్వరం తగ్గడం లేదు. పరీక్షల్లో పాజిటివ్‌గానే చూపుతోంది. దీంతో ఎజిత్రోమైసిన్, ఎరిత్రోమైసిన్ వంటి యాంటీ బయోటిక్ మందులు కూడా చికిత్సల్లో వాడుతున్నారు. అయినప్పటికీ ప్రయోజనం కనిపించడం లేదు.

మరణాలు అధికమే... కొందరు రోగులు థ్రాంబోసైటోపీనియా (ప్లేట్‌లెట్లు తగ్గడం) లక్షణాలతో మృతి చెందుతున్నారు. రోగుల మెదడులో రక్తస్రావం జరగడంతో పాటు ఎన్‌కెఫలోపతి సమస్య ఏర్పడి మరణించినట్లు వైద్య రికార్డులు చెబుతున్నాయి. వీరికి ముందు జాగ్రత్తగా యాంటీ వైరల్ ఔషధం.. ఎసైక్లోవీర్ ఇచ్చినా కూడా ప్రయోజనం లేకుండా పోతోంది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో 11 స్క్రబ్ టైఫస్ మరణాలు నమోదైతే, గుంటూరు జీజీహెచ్‌లోనే ఐదు మరణాలు వెలుగు చూశాయి. మృతులు ఐదుగురూ మహిళలు కావడం గమనార్హం. గుంటూరు జీజీహెచ్‌లో గతేడాది 1,316 మంది జ్వర బాధితులకు స్క్రబ్ టైఫస్ నిర్ధారణ పరీక్షలు చేయగా.. 121 పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. ఒక్క మరణం కూడా సంభవించ లేదు. ఈ ఏడాది ఇప్పటి వరకు 569 నమూనాలను పరీక్షించగా, 107 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఐదుగురు మృతి చెందారు. బుధవారం జీజీహెచ్‌లో 12 మంది ఈ వ్యాధికి చికిత్స పొందుతుండగా, వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూకు తరలించారు.

జినోమ్ సీక్వెన్సింగ్‌కు రక్త నమూనాలు


డ్రగ్ రెసిస్టెన్స్, వ్యాధి కారక క్రిముల ఉత్పరివర్తనం నేపథ్యంలో రోగుల రక్త నమూనాలను జినోమ్ సీక్వెన్సింగ్‌కు పంపాలని అధికారులు నిర్ణయించారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగుల నుంచి నమూనాలు సేకరించి వాటిని పరీక్షల కోసం మంగళగిరిలోని ఎయిమ్స్, వెల్లూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ, పుణెలోని నేషనల్ వైరాలజీ ల్యాబ్‌కు పంపుతున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి బుధవారం తెలిపారు. స్క్రబ్ టైఫస్ జ్వరాల చికిత్సపై ఆయన తన చాంబర్‌లో పలు వైద్య విభాగాల అధికారులతో సమీక్ష జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసుల నమూనాలను జినోమ్ సీక్వెన్సింగ్ పరీక్షకు పంపితే అసలు కారణాలు తెలుస్తాయన్నారు. డ్రగ్ ఆఫ్ చాయిస్ కూడా తెలుస్తుందని, దీనివల్ల రోగులకు మరింత మెరుగైన చికిత్స అందించవచ్చని ఆయన వెల్లడించారు. గతంలో 90 శాతం మంది రోగుల శరీరంపై వ్యాధి కారక.. నల్ల మచ్చ (ఎష్కార్) కనిపించేదన్నారు. ప్రస్తుత రోగుల్లో 60 శాతం మందిలోనే ఎష్కార్ కనిపించిందని డాక్టర్ రమణ తెలిపారు.

మరో ముగ్గురికి స్క్రబ్ టైఫస్

» బాధితుల్లో నాలుగేళ్ల చిన్నారి

» వ్యాధి లక్షణాలతో వృద్ధుడి మృతి

బొండపల్లి, అనంతపురం వైద్యం, దేవరాపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో మూడు స్క్రబ్ టైఫస్ కేసులు వెలుగు చూశాయి. వ్యాధి లక్షణాలతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం మరువాడ గ్రామంలో నాలుగేళ్ల చిన్నారికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా తేలింది. సోమవారం బాలికకు తీవ్ర జ్వరం రావడంతో తొలుత దేవుపల్లి పీహెచ్‌సీకి, అనంతరం గజపతినగరం సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షలు నిర్వహించగా బుధవారం స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అయితే బాలికకు ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇద్దరికి స్క్రబ్ టైఫస్ సోకిందని అనంత ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్యాధికారులు బుధవారం తెలిపారు. రాయదుర్గం, ధర్మవరం ప్రాంతాలకు చెందిన 16, 12 ఏళ్ల బాలికలకు పాజిటివ్ వచ్చిందని తెలిపారు. వీరికి ప్రత్యేక వార్డులో చికిత్స అందిస్తున్నామన్నారు. కాగా, స్క్రబ్ టైఫస్ లక్షణాలతో అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం అల్లుపురంలో 80 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను కుటుంబీకులు సోమవారం కేజీహెచ్‌లో చేర్పించారు. స్క్రబ్ టైఫస్ నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్ రాగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు.





ఈ – ఆఫీసులో ముందంజ

- రాష్ట్రంలో 9వ స్థానంలో కలెక్టరు
- 2వ స్థానంలో జాయింట్ కలెక్టర్
- ప్రజలకు జవాబుదారీ పాలన అందించడమే లక్ష్యం

కర్నూలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల మంత్రులు, కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ఈ-ఆఫీస్ దస్త్రాలు పరిష్కారంలో ఏమేరకు చొరవ చూపారో సీఎం చంద్రబాబు బుధవారం సమీక్షించారు. ఈ-ఆఫీస్ ఫైళ్ల పరిష్కారంలో కలెక్టరు డాక్టర్ ఏ. సిరి 9వ స్థానంలో ఉంటే.. జాయింట్ కలెక్టర్ (జేసీ) నూరల్ ఖమర్ రెండో స్థానంలో నిలిచారు. రాష్ట్రంలో సముచిత స్థానంలో నిలిచి సీఎం చంద్రబాబు చేత ప్రశంసలు అందుకున్నారు.



9వ స్థానంలో కలెక్టరు

జిల్లా కలెక్టరు డాక్టర్ ఏ. సిరి పర్యవేక్షణలో దాదాపు 34 శాఖలు ఉంటాయి. ఆయా శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో ఎంతో చొరవ చూపారు. జిల్లాలో వివిధ విభాగాల ద్వారా జూలై 15 నుంచి ఈ నెల 9వ తేది వరకు సంబంధించిన ఈ-ఆఫీస్ ఫైళ్లు 1023 వచ్చాయి. అందులో కేవలం ఒక రోజు 14.07 గంటల్లోగా 714 సమస్యలు పరిష్కరించి రాష్ట్రంలో 9వ స్థానంలో నిలిచారు. దాదాపు 250కి పైగా ఫైల్స్ గత కలెక్టరు ద్వారా వచ్చినవే. డాక్టర్ ఏ. సిరి కలెక్టరుగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లలో బీజీ అయ్యారు. ఆ తరువాత జిల్లాలో విస్తృత పర్యటనలు చేసినా, ఈ-ఫైళ్ల పరిష్కారంలో సకాలంలో స్పందించి వేగంగా పరిష్కరించారు. అదే వేగంతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది.

రెండో స్థానంలో జేసీ



జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) నూరల్ ఖమర్ ఈ-ఆఫీస్ ఫైళ్ల పరిష్కారంలో రెండో స్థానంలో నిలిచారు. ఆయన రెవెన్యూ, సివిల్ సప్లయ్ వంటి శాఖలు కీలకంగా చూస్తున్నారు. ఆ శాఖల నుంచి 274 దస్త్రాలు రాగా, కేవలం ఒకరోజు, 2.43 గంటల్లో మొత్తం ఫైళ్లు పరిష్కరించి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచారు. ఈ-ఆఫీస్ ఫైళ్ల పరిష్కరించడంతో కలెక్టరు, జేసీలు వేగంగా స్పందిస్తున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వం కితాబు ఇచ్చిందని అధికారులు ద్వారా తెలిసింది.

ఈ-ఆఫీస్ ఫైల్ అంటే..

డిజిటల్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ-ఆఫీస్ ఫైల్ విధానం తీసుకొచ్చింది. ప్రతి కార్యాయంలో ఈ-ఆఫీస్ వ్యవస్థను అమలు చేయాలంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 12న జరిగిన మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కాగితపు రహిత పాలన, లాగిన్ ద్వారా వచ్చిన ఫైళ్లు, సమస్యలు తక్షణమే పరిష్కరించి ప్రజలకు జవాబుదారీ పాలన అందించాలన్నదే ఈ-ఆఫీస్ ప్రధాన్య లక్ష్యం. ఆర్థిక అంశాలతో ముడిపడి ఫైళ్లు, మరీ సంక్లిష్టమైన అంశాలు తప్ప మిగిలిన అంశాలను తక్షణమే పరిష్కరించాల్సి ఉంది. అలాగే.. ఆర్థికపరమైన సమస్యలను ఆర్థిక లభ్యతను బట్టి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపాలని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

పారదర్శక పాలనే లక్ష్యం

ప్రజలకు జవాబుదారీ, పారదర్శక పాలన అందించడమే ఈ-ఆఫీస్ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించిన ఈ-ఆఫీస్ ఫైళ్లు 1,023 వచ్చాయి. అందులో 714 ఫైళ్లు ఒక రోజు 14.07 గంటల్లో క్లియర్ అయ్యాయి. మిగిలిన దస్త్రాలు కూడా తక్షణమే క్లియర్ చేస్తాం. కాగితపు రహిత పాలనలో భాగంగా ఈ-ఆఫీస్ ఫైళ్ల క్లియర్ చేడయంతో రాష్ట్రంలో 9వ స్థానంలో ఉండడం సంతోషంగా ఉంది. రెండో స్థానంలో జేసీ ఉండడం అభినందనీయం. మునుముందు వేగంగా పరిష్కరించి ఉత్తమమైన స్థానంలో జిల్లాను ఉంచాలని, ప్రజలకు మెరుగైన సేవలు ద్వారా పారదర్శక పాలన అందించాలనే ఆశయంగా ముందుకు వెళ్తాం.

● డాక్టర్ ఏ. సిరి, కలెక్టరు



మెరుగైన సేవలు అందించండి

- ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి
- జేసీ నూరుల్ ఖమర్



నన్నూరు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్

ఓర్వకల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని జేసీ నూరుల్ ఖమర్ ఆదేశించారు. బుధవారం మండలంలోని నన్నూరు గ్రామ సచివాలయాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని, పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. సచివాలయంలో మూమెంట్ రిజిస్టర్, హాజరు పట్టిక, కార్యాలయ సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. సిబ్బంది హాజరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై సిబ్బందితో ఆరా తీశారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని, గైర్హాజరైతే కఠినచర్యలు తప్పవన్నారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా తనిఖీ చేశారు. అంగన్‌వాడీలో నిర్వహణ, పిల్లలకు అందుతున్న ఆహారం, పోషణ ప్రణాళికలు అమలుపై సమగ్రంగా పరిశీలించారు. పోషన్ యాప్‌లో నమోదు చేసిన వివరాలు, రికార్డులు, హాజరు సమాచారం, పంపిణీ ప్రక్రియ పరిశీలించారు. ప్రజలకు సరైన పోషకాహారాన్ని అందించాలన్నారు. మండల ప్రాథమిక పాఠశాలను, లొద్దిపల్లె గ్రామంలో ఫారెస్టు భూమిని గ్రీన్‌కో 20హెక్టార్ల భూమిని కావాలని దరఖాస్తు చేసుకోగా ఫారెస్టు భూమిని ఆయన పరిశీలించారు. గుమితం తండా సమీపాన ఉన్న జల విద్యుత్ కేంద్రంలో తనిఖీలు చేపట్టారు. ఆర్డీవో సందీప్ కుమార్, తహసీల్దార్ విద్యాసాగర్, వీఆర్వో మోహన్, సర్వేయర్ శంకర్ మాణిక్యం, అధికారులు తదితరులు పాల్గొన్నారు

ప్రశాంతంగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష

75 మంది అభ్యర్థులు గైర్హాజరు



కేవీ సుబ్బారెడ్డి కళాశాలలోని సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షలు ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగుతాయి. నగర శివారులోని కేవీ సుబ్బారెడ్డి కళాశాలలోని అయాన్ డిజిటల్ సెంటర్ లోని పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్ పర్యవేక్షించారు. మొదటిరోజు 665 మంది అభ్యర్థులకు గాను 75 మంది గైర్హాజరయ్యారు. టెట్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలను మండల విద్యాశాఖ అధికారులు ఆదాంబాషా, వినోద్ కుమార్, వనజ కుమారి పర్యవేక్షించారు.

రైతు సమస్యలు పట్టని కేంద్రం

- సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

ఆస్పరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా, రైతు సమస్యలను కేంద్రం పట్టించుకోవడం లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ తీవ్ర స్థాయిలో విమర్శించారు. బుధవారం ఆస్పరిలో సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అధ్యక్షతన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా రైతుల సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. గ్రామాల్లోని నీటి సమస్యలు కేంద్రం చెవికి ఎక్కడం లేదని ధ్వజమెత్తారు. కర్నూలు జిల్లాలో అధికంగా పండించే పత్తి, టమోటా, ఉల్లి, మిర్చి పంటలకు, ఇతర జిల్లాల్లో పండించే మామిడి, సపోటా, అరటి, దానిమ్మ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించలేదని విమర్శించారు. వేదవతి, గుండ్రేవుల, హంద్రీ నీవా పెండింగ్‌లో ప్రాజెక్టులను పూర్తి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శులు లెనిన్ బాబు, రాజాసాహెబ్, మద్దిలేటి, కౌలు రైతుల జిల్లా సంఘం అధ్యక్షుడు తిమ్మయ్య, నాగేంద్రయ్య, మండల కార్యదర్శి విరుపాక్షి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టారు.

బస్టాండ్‌ను శుభ్రంగా ఉంచండి

- ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ సిరి
- ఆర్టీసీ డార్మిటరీ నిర్వహణపై అసంతృప్తి
- స్టాళ్లు, హోటళ్లలో నిబంధనలు పాటించాలని ఆదేశం

కర్నూలు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్నూలు కొత్త బస్టాండ్‌ను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కర్నూలు కొత్త బస్టాండ్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ఉన్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వర డార్మిటరీలో టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి సంబంధిత కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్టీసీ అధికారి శ్రీనివాసులను ఆదేశించారు.



కొత్తబస్టాండ్‌లో హోటల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



డిపోలో గ్యారేజీ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

బస్టాండ్‌లో ఉన్న వివిధ స్టాల్స్‌లో నిబంధనల మేరకు అమ్ముతున్నారా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వాటితో పాటు భోజనం, టిఫిన్ హోటళ్లను సైతం కలెక్టర్ తనిఖీ చేశారు. హోటళ్ల నిర్వహణలో కచ్చితంగా శుభ్రత పాటించాలని, నాణ్యమైన నూనెను వాడాలన్నారు. ప్రజా రవాణాను భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో బస్టాండులో ఉన్న నిఘా, భద్రత విభాగాలను పరిశీలించారు. ప్రయాణికులు వినియోగించే టాయిలెట్ ఎంట్రెన్స్ వద్ద డోర్ ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. బస్టాండులో ఏర్పాటు చేసిన త్రాగునీటి కేంద్రాన్ని పరిశీలించి, అ ప్రాంతంలో దుర్వాసన రావడం గమనించి, పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. డిపోలో డ్రైవర్లు, సిబ్బందిని బ్రీత్ అనలైజర్ ద్వారా క్షుణ్ణంగా చెక్ చేస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. డిపో గ్యారేజిలో డీజిల్ బంకులో డీజిల్ సాంద్రత, ఉష్ణోగ్రతను స్వయంగా పరిశీలించారు. ఇంధన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్టీసీ ప్రజా రవాణా అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

విద్యుత్‌శాఖ ఎస్ఈ ప్రదీప్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్ఈ ప్రదీప్‌కుమార్

కల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినియోగాదరులకు అంతరాయం లేకుండా మెరుగైన విద్యుత్ అందించేలా అధికారులు కృషిచేయాలని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఆర్. ప్రదీప్‌కుమార్ అన్నారు. బుధవారం విద్యుత్ భవన్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఆయా డివిజన్ల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఓవర్ లోడ్ ఉండే 11 కేవీ ఫీడర్లను బైఫరగేట్ చేయడంతో పాటు అదనపు ఫీడర్ల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఎస్ఏవో చిన్నరాఘవులు అధికారులు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఎస్ఈకి 14 ఫిర్యాదులు

డయల్ యువర్ కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ కార్యక్రమానికి 14 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. అందులో బిల్లింగ్ రిలేటెడ్-4 వోల్టేజీ, అంతరాయం, న్యూ సర్వీస్ కోసం -3, ఇతరులు-7 ఫిర్యాదులు అందించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఈ ఆదేశించారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.83 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలను కాలక్షేపపు మండపంలో బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ వాణి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులు స్వామి వారికి సమర్పించిన 32 రోజుల కానుకలను బుధవారం లెక్కించగా రూ.83,71,517 నగదు, 55 గ్రాముల బంగారం, 9.810 కిలోల వెండి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి సుధాకర్‌రెడ్డి ఆలయ అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వరరావు, దేవాలయపు ఉప ప్రధాన అర్చకులు మహదేవప్ప, అర్చకులు నాగరాజు స్వామి పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్

కర్నూలు లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శాశ్వత లోక్‌అదాలత్‌లో కేసులను సత్వరంగా పరిష్కరించుకొని సత్వర న్యాయం పొందవచ్చని శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ తెలిపారు. బుధవారం లోక్‌అదాలత్ కార్యాలయంలో ఓకేసు పరిష్కారం సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయక కళాశాలలు సేవాలోపం చేస్తే శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించి వాటిని తిరిగి పొందవచ్చని తెలియజేశారు. కర్నూలుకు చెందిన ఇమ్రాన్ అనే విద్యార్థి నంద్యాలలో ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఫస్టియర్ చదువుతుండగా విద్యార్థి తండ్రి అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఆ విద్యార్థి చదువును కొనసాగించ లేకపోయాడు. ఇంట్లో జీవనోపాధి కోసం తాను ప్రైవేటు ఉద్యోగం చేసుకోవడానికి తన సర్టిఫికెట్లను కళాశాల అధికారులను అడిగారు. నాలుగు సంవత్సరాల కళాశాల ఫీజును చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాల అధికారులు తెలియజేయడంతో ఆ విద్యార్థి శాశ్వత లోక్‌అదాలత్‌ను ఆశ్రయించాడు. దీంతో లోక్ అదాలత్ కళాశాలకు నోటీసు జారీ చేసి కేసును విచారించింది. ఇరుపార్టీలకు ఆమోద యోగ్యంగా విద్యార్థికి అతని సర్టిఫికెట్లను వాపసు చేయడానికి కళాశాల అధికారులు అంగీకరించడంతో కేసును ముగించినట్లు చైర్మన్ ఎం.వెంకట హరినాథ్, సభ్యులు శివశంకర్ రెడ్డి, రాజుబాబు తెలిపారు.



విద్యార్థికి సర్టిఫికెట్లు ఇస్తున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, సభ్యులు

ప్రకృతి సాగును పెంచాలి

- జిల్లా ప్రాజెక్టు అధికారి మాధురి

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ప్రకృతి సాగును పెంచితే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు అధికారి మాధురి తెలిపారు. బుధవారం కర్నూలు నగరంలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీపీఎం మాధురి ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యతను వివరించారు. ఈసమావేశానికి ప్రాజెక్టు కన్సల్టెంట్ రాజేశ్వర్, డీఎల్ ఎంపీ లక్ష్మయ్య, సౌర ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సందీప్ కుమార్ హాజరయ్యారు. ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు ఎలా చెప్పాలో సిబ్బందికి తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామస్థాయిలో విస్తరించేందుకు ఐసీఆర్‌పీ (ఆదర్శ రైతులు)లకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీపీఎం మాధురి తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంయూ సిబ్బంది వంశీకృష్ణ, శ్వేత, మల్లికార్జున, జగదీష్, బషీర్, బుజేశ్వరుడు, వాసవి, లావణ్య, సుశ్మంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఎం మాధురి

ప్రాథమిక హక్కులను తెలుసుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ప్రాథమిక హక్కులను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి అన్నారు. బుధవారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమన్వయంతో సిల్వర్ జూబ్లీ కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో పౌర. రాజకీయ హక్కుల దినోత్సవం జరుపుకుంటున్నారన్నారు. విద్యార్థుల చేతుల్లో భవిష్యత్ ఉందని, ఇప్పటి నుంచే బాధ్యతగా ఉండాలన్నారు. సైబర్ నేరాల మీద అనుక్షణం అప్రమత్తం ఉండాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ శివరామ చంద్రరావు, మెంబర్స్ రాయపాటి సాంబశివరావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి, అధ్యాపకులు ఎల్లా కృష్ణ నాయక్, సబితాదేవి, ఫామీదాబేగం, రాజశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.

సందేహాలపై సంప్రదించండి

హౌసింగ్ పీడీ చిరంజీవి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన గృహాలు, వాటి పురోగతి, స్థితిగతులపై లబ్ధిదారులకు సందేహాలుంటే ఫోన్ ద్వారా సంప్రదించాలని హౌసింగ్ పీడీ చిరంజీవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు తమ ఇంటికి సంబంధించి ప్రభుత్వం నుంచి రావాల్సిన గృహ నిర్మాణ సామగ్రి సిమెంట్, స్టీల్‌తో పాటు నిర్మాణానికి రావాల్సిన బకాయి బిల్లులు తదితర వాటిపై కార్యాలయంలో ఏర్పాటు చేసిన ల్యాండ్ లైన్‌కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. ప్రతి గురువారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు లబ్ధిదారులు 08518-257481 ఫోన్ నెంబరుకు చేయాలని ఆయన కోరారు.

ప్రజల ఆకాంక్షను గౌరవించాలి

- మంత్రివర్గ ఉప సంఘం కన్వీనర్ అనగాని సత్యప్రసాద్‌కు తేల్చి చెప్పిన నేతలు
- మంత్రితో తిక్కారెడ్డి, డా. పార్థసారథి, మీనాక్షినాయుడు సమావేశం
- ఆదోని బంద్ సూపర్ సక్సెస్

8



సంకల్ప ఫలించేనా..?

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- 15 నుంచి ప్రీ ఫైనల్స్
- ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ పరీక్షలు
- కర్నూలు జిల్లాలో మొత్తం 167 కళాశాలలు
- 48,688 మంది విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు 50రోజులతో సంకల్ప షెడ్యూల్‌ను ప్రకటించింది. దీనిని పకడ్బందీగా అమలు చేసేందుకు ఇంటర్ బోర్డు కమిషనర్, జిల్లా అధికారులను, ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులకు ముఖ్యమైన ప్రశ్నాపత్రాలను పంపిణీ చేసి వాటిని ప్రిపేర్ చేస్తున్నారు. నవంబరు 14 నుంచి డిసెంబరు 15వ తేదీ నాటికి సిలబస్‌ను పూర్తిచేసి ఉదయం పూట ప్రత్యేక తరగతులను విద్యార్థులకు బోధించాలని సూచించారు. డిసెంబరు 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 24వ తేదీ వరకు విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించి స్లిప్, వీక్లీ టెస్టులు నిర్వహించి విద్యార్థులకు నేర్పిస్తారు. విద్యార్థులను ఏ, బీ, సీ గ్రూపులుగా విభజించారు. యావరేజీ, ఫెయిలయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి పాసయ్యేలా అధ్యాపకులకు విద్యార్థులను దత్తత చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

విద్యకు పెద్ద పీట..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తర్వాత ఇంటర్మీడియట్ విద్యకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పెద్ద పీట వేశారు. గతంలో ఎప్పుడూ లేని విదంగా ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, పూర్తి స్థాయిలో అధ్యాపక బృందాన్ని నియమించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం పరీక్షలు జరుగుతాయని, అందుకు తగ్గట్లుగా ఇంటర్ బోర్డు అధికారులు ప్రణాళిక రూపొందించుకోవాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ రంజిత్ బాషా సూచించారు.

9వేల మంది పేద విద్యార్థులు

కర్నూలు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ కళాశాలలు 167 ఉన్నాయి. ఈ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం కలిపి 48,668 మంది విద్యార్థులు విద్యను చదువుకుంటున్నారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 23 ఉన్నాయి. ఈ కళాశాలలో 9 వేల మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారు.



ప్రత్యేక ప్రణాళిక



జిల్లాలో ఇంటర్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక ప్రణాళిక తీసుకున్నారు. సంకల్ప షెడ్యూల్‌ను బోర్డు అధికారులు ప్రకటించారు. ఈసంకల్ప షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు సంబంధించి సిలబస్‌ను పూర్తిచేసి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ, స్లిప్ టెస్టులు, వీక్లి టెస్టులు నిర్వహించి రివిజన్ చేస్తున్నాం.

● సురేష్‌బాబు, డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఆఫీసర్ (డీఐవో), కర్నూలు

పరీక్షలకు సంసిద్ధం చేస్తూ..

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు డిసెంబరు 15నుంచి 20వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు కొనసాగుతాయి. ఇప్పటికే విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించి చదువులో వెనుకబడిన విద్యార్థులకు స్లిప్ టెస్టులు, వీక్లీ టెస్టులు నిర్వహిస్తున్నారు. కొన్ని కళాశాలలో ప్రత్యేక తరగతులు జరగడం లేదని తెలుస్తుంది. 2026 జనవరి 21న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. అదేనెల 23న పర్యావరణ విద్య పరీక్ష జరుగుతుంది. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్స్ కొనసాగుతాయి. ఈ ప్రాక్టికల్స్ పరీక్షలు ఒకేషనల్ కోర్సులో మూడు విడతలగానూ, జనరల్ కోర్సులో రెండు విడతలుగానూ నిర్వహించేందుకు ఇంటర్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు 9,044 మంది కాగా, బైపీసీ విద్యార్థులు 1493 మంది ఉన్నారు.



పరీక్షల షెడ్యూల్ విడుదల

ఇంటర్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ ఇప్పటికే విడుదలైంది. 2026 సంవత్సరం ఫిబ్రవరి 23న ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, ఫిబ్రవరి 24న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతాయి. ఈపరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయి. ఈసారి ఇంటర్‌బోర్డు అధికారులు పరీక్షకు మరలా పరీక్షకు మధ్య గ్యాప్ పరీక్షల షెడ్యూల్ నిర్ణయించారు. దీంతో విద్యార్థుల ఒత్తిడిని తగ్గించేందుకు చర్యలు తీసుకున్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

- మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి
- హాస్టళ్ల విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ



హాస్టల్ బాలికలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వివిధ హాస్టల్‌లో చదువుతున్న బాలికలకు సొంత నిధులు వెచ్చించి దుప్పట్లు పంపిణీ చేశారు. తన తల్లిదండ్రులు బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మల జ్ఞాపకార్థం ప్రభుత్వ హాస్టల్‌లోని 1000మంది బాలికలకు ఉచితంగా దుప్పట్లను అందజేశామన్నారు. సొంత నిధులు రూ.3.50లక్షల విలువ చేసే దుప్పట్లను పంపిణీ చేసి ఉదారత చాటుకున్నారు. ఈసందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ చలి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటూ 6నుంచి డిగ్రీ విద్యను అభ్యసిస్తున్న హాస్టల్ విద్యార్థినులకు నాణ్యమైన దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. బాలికలు క్రమశిక్షణ కలిగి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలన్నారు. ప్రతి విద్యార్థికి జ్ఞానంతోపాటు లోకజ్ఞానం ముఖ్యమన్నారు. చదువు జ్ఞానాన్ని నేర్పిస్తే సమాజం లోకజ్ఞానాన్ని నేర్పిస్తుందన్నారు. పుస్తక పఠనం, దినపత్రికలు చదవడం వల్ల జ్ఞానం పెరుగుతుందన్నారు. బాలికలు చదువుల్లో బాగా రాణిస్తున్నారన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో పాక్‌పై దాడి చేసింది మహిళా సైనికులే అని కొనియాడారు. ఈసందర్భంగా గజల్ కళాకారుడు మహమ్మద్‌మియా, కవి ఇనాయతుల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన పాటలు, గీతాలు పలువురిని అలరించాయి. పేదలకు బీసీ రాజారెడ్డి అందిస్తున్న సేవలను వారు కొనియాడారు. విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, ఉపసర్పంచ్ బురానుద్దీన్, భానుముక్కల సొసైటీ చైర్మన్ అత్తార్ అబ్దుల్ కలాం, జ్యోతిష్య పండితులు వెంకటరమణశాస్త్రి, మౌళీశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారించాలి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలని కలెక్టర్ డా.ఏ. సిరి అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాల నిర్మూలనకు వంద రోజుల జాతీయ ప్రచార కార్యక్రమం నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఇందులో మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు, పోలీసు, విద్య, మున్సిపల్, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ తదితర శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ నవంబరు 27 నుంచి వచ్చే ఏడాది మార్చి 8వ తేదీ వరకు వంద రోజుల జాతీయ ప్రచార కార్యక్రమంలో బాల్య వివాహాల నివారణ చైతన్యం పెంచాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా, ఐసీడీఎస్ పీడీ విజయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలోత్సవం

- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు
- విజేతలకు బహుమతులు ప్రదానం
- ముగిసిన పిల్లల పండుగ



బాలోత్సవం కార్యక్రమం

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో మంగళవారం ప్రారంభమైన ఐదో కర్నూలు బాలోత్సవం బుధవారం ఘనంగా ముగిసింది. ఉదయం విద్యార్థులకు చిత్రలేఖనం, కథ చెప్పడం, తెలుగులో మాట్లాడటం, కార్టూన్ వేయడం, రైమ్స్ చెప్పడం, జానపద నృత్యాలు, కోలాటాలు, సంగీత వాయిద్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. సాయంత్రం బాలోత్సవం అధ్యక్షుడు జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన ముగింపు సభ నిర్వహించారు. ఈ సభలో అమరావతి బాలోత్సవం నాయకురాలు స్వరూపారాణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషితోనే బాలోత్సవం విజయవంతమైందన్నారు. బాలోత్సవం గౌరవాధ్యక్షుడు జి. పుల్లయ్య మాట్లాడుతూ బాలోత్సవం వల్ల పండుగ వాతావరణం ఏర్పడిందన్నారు. ఇండస్ పాఠశాల ప్రిన్సిపాల్ మీనాక్షి విల్సన్ మాట్లాడుతూ విజేతలకు, పిల్లలను కష్టపడి తీసుకువచ్చిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డా. అక్తర్ భాను, ప్రైవేటు విద్యాసంస్థల గౌరవాధ్యక్షుడు పీబీవీ సుబ్బయ్య, మాంటిస్సోరి విద్యాసంస్థల సీఈవో విల్సన్, యునైటెడ్ ఇన్సూరెన్స్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ బి. నాగార్జున రెడ్డి, ఆర్థికవేత్త మన్సూర్ రెహిమాన్, వైద్యులు రాయపు రామచంద్రారెడ్డి, రామగోపాల్ రావు, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కే. సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షను గౌరవించాలి

- ఆదోని జిల్లా పశ్చిమ ప్రాంత సెంటిమెంట్
- మంత్రివర్గ ఉప సంఘం కన్వీనర్ అనగాని సత్యప్రసాద్‌కు తేల్చి చెప్పిన నేతలు
- మంత్రితో తిక్కారెడ్డి, డా. పార్థసారథి, మీనాక్షినాయుడు సమావేశం
- జిల్లా ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై సుదీర్ఘ చర్చ
- ఆదోని బంద్ సూపర్ సక్సెస్

కర్నూలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆదోని పశ్చిమ ప్రాంతం నియోజకవర్గాల ప్రజల ఆకాంక్ష.. సెంటిమెంట్ ఆదోని జిల్లా. నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలి. కరువు ప్రాంత ప్రజలకు పాలనసౌలభ్యం.. అభివృద్ధికి బాటలు వేయాలని ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఏకరువు పెట్టారు. బుధవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఆధ్వర్యంలో జిల్లాల పునర్విభజనపై సీఎం చంద్రబాబు నియమించిన మంత్రివర్గ ఉప సంఘం కన్వీనర్, రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్‌తో వారు భేటీ అయ్యారు. ఆదోని రెవెన్యూ డివిజన్ ఒకప్పుడు బళ్లారి జిల్లాలో ఉండేదని, బాషా సంయుక్త రాష్ట్రాల విభజనలో భాగంగా 1952లో కర్నూలు జిల్లాలో కలిసిందని మంత్రి దృష్టికి తెచ్చారు. ఆ సమయంలోనే ఆదోనిని జిల్లాగా చేయాలని డిమాండ్ బలంగా ఉండేదని వివరించారు. ఆదోని నిత్యం కరువు, వలసలతో సతమతమవుతున్న ప్రాంతం అని.. జిల్లా కేంద్రమైన కర్నూలుకు సమస్యలపై వెళ్లాలంటే 75 నుంచి 150 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని, ప్రజలకు సౌలభ్యంగా లేదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల పునర్విభజన కోసం మంత్రివర్గ ఉప సంఘం వేయడంతో ఆదోని జిల్లా ఏర్పాటుచేయాలనే డిమాండ్ ప్రజల్లో బలంగా నాటుకుపోయిందని, అది ప్రజలకు సెంటిమెంటుగా మారిందని వివరించారు. గెజిట్ నోటిఫికేషన్‌లో ఆదోని జిల్లా లేకపోవడంతో ఒక్కసారిగా ప్రజాగ్రహం ఉప్పొంగి.. ఉద్యమాలు, ఆందోళనలకు బీజం పడిందని, నిరసనల వేగం పుంజుకుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



సీఎంతో చర్చిస్తాం

జిల్లాల పునర్విభజన కోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘం వేసింది. నాలుగు నెలలు గడి చింది. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు మంత్రి వర్గ ఉప సంఘాన్ని కలిసి ఎందుకు నివేదిక ఇవ్వలేకపోయారంటూ జిల్లా నాయకులను మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశ్నించినట్లు తెలిసింది. ఇప్పటికైనా సమగ్ర వివరాలతో సీఎం దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తామని వివరిం, చినట్లు తెలిసింది. జనవరి 1వ తేదీ నుంచి జనగణనకు శ్రీకారం చుడుతుండటతో ఈ సమయంలో జిల్లాల పునర్విభజన ఎంతవరకు సాధ్యం.. ఆదోని జిల్లా ఏర్పాటుకోసం మరోసారి నోటిఫికేషన్ ఇవ్వడం ఎంతవరకు సాధ్యం. న్యాయపరంగా, సాంకేతికపరమైన చిక్కు లు ఉన్నాయా? తదితర అంశాలపై మంత్రులు సమీక్షించినట్లు తెలుస్తుంది.

ఉప్పొంగిన ప్రజా ఉద్యమం

ఆదోని జిల్లా ఏర్పాటు కోసం జిల్లా సాధన సమితి, జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఆదోని బంద్ సంపూర్ణంగా ముగిసింది. ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమం తర్వాత ఆస్థాయిలో ప్రజలందరూ సమష్టిగా పార్టీలకతీతంగా జిల్లా సాధన కోసం రోడ్డెక్కడం ఇదే ప్రథమం. ఉదయమే జేఏసీ ఆధ్వర్యంలో ఆయా పార్టీల నాయకులు ఆర్టీసీ బస్సులను రోడ్డెక్కకుండా ఆపేశారు. వ్యాపారులు, వివిధ వ్యాపార సంఘాలు, దుకాణాలను మూసివేసి స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఆదోని జిల్లా ఆకాంక్షతో ప్రజలు నిర్వహించిన బంద్ సంపూర్ణ విజయం కావడం కొసమెరుపు.

ఆ రోజు పట్టించుకోని వైసీపీ నేతలు

రాష్ట్ర విభజన తర్వాత 13జిల్లాలతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జిల్లాల పునర్విభజనకు శ్రీకారం చుట్టింది. 2022లో 13 జిల్లాలను 27 జిల్లాలుగా విభజించి పరిపాలనకు శ్రీకారం చుట్టింది. ఆరోజు ఆదోని జిల్లా ఏర్పాటు చేసేందుకు చక్కటి అవకాశం ఉంది. అప్పుడు కర్నూలు ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు ఎంపీలతో పాటు 14మంది ఎమ్మెల్యేలు కూడా వైసీపీకి చెందిన వారే ఉన్నారు. ఆదోని పశ్చిమ ప్రాంతమైన ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల నుంచి వైసీపీ ఎమ్మెల్యేలే ఎన్నికయ్యారు. ఆదోని జిల్లా చేయాలని పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి బాటలు వేయాలని ఏ ఒక్క వైసీపీ ఎమ్మెల్యే కూడా ఆరోజు అప్పటి సీఎం జగన్‌ను అడిగిన దాఖలాలు లేవని స్థానికులు అం టున్నారు. ఆ రోజే ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మిగిలిన ఎమ్మెల్యేలను కూడగట్టుకుని జగన్‌పై గట్టిగా ఒత్తిడి తెచ్చి ఉంటే జిల్లా ఏర్పాటు సాధ్యమయ్యేది. నాడు జగన్ భయపడ్డాడో.. జిల్లా అవసరం లేదనుకున్నారో.. వారికే తెలియాలి. నాడు పట్టించుకోని వైసీపీ నాయకులు ప్రస్తుతం ఆదోని జిల్లా కోసం గళమెత్తుతున్నారు. జిల్లా కావాలని అడగడంలో తప్పు లేదు.. ఆ రోజు ఎందుకు అడగలేదని, జిల్లా ఇవ్వని జగన్‌ను ఎందుకు నిలదీయలేదని.. అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పుడు ప్రశ్నించకుండా రాజకీయ స్వలాభాపేక్షతో వైసీపీ నాయకులు జిల్లాను అడగడం ఎంతవరకు సమంజసం అంటూ ప్రశ్నిస్తున్నారు. ఆదోని జిల్లా, నాలుగు మండలాల ఏర్పాటు అంశాన్ని అసెంబ్లీలో గళమెత్తినది కూటమి ఎమ్మెల్యే పార్థసారధే అన్నారని పలువురు పేర్కొంటున్నారు. అయినా రాజకీయ స్వలాభాలు పక్కనపెట్టి ప్రజల ఆకాంక్ష మేరకు జిల్లా ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

కీలక విషయాలపై నివేదిక

- ముఖ్యమంత్రికి సమర్పించిన శ్రీశైలం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్
- విజిలెన్స్ విభాగం ఆవశ్యకత, డిజిటలైజేషన్ విధానాన్ని వివరించిన చైర్మన్



ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదిక అందజేస్తున్న రమేశ్ నాయుడు

శ్రీశైలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి తరహాలో శ్రీశైల క్షేత్రాభివృద్ధికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రిని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు సచివాలయంలో కలిశారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించి క్షేత్ర పరిధిలో చేపట్టాల్సి కీలక విషయాల ప్రత్యేక నివేదికను సమర్పించారు. ప్రధానంగా క్షేత్రాభివృద్ధి కోసం, భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేందుకు క్షేత్ర పరిధినంతా డీఎస్పీ స్థాయి అధికారితో విజిలెన్స్ విభాగాన్ని తక్షణమే ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించినట్లు చైర్మన్ తెలిపారు. అదే విధంగా ప్రస్తుతం ఆచరణలో ఉన్న ఆన్‌లైన్ సేవలతో పాటు ప్రతి సౌకర్యాన్ని డిజిటలైజేషన్ చేయడం వల్ల యాత్రికులు నేరుగా సేవలు పొందే అవకాశం ఉంటుందని అన్నారు. క్షేత్ర పవిత్రతకు భంగం కలిగించే నిషేధిత అంశాలకు తావివ్వకుండా ఉండేందుకు నివాస గృహాలను సున్నిపెంటకు బదిలీ చేసే చర్యలను పారదర్శకంగా నిర్వర్తించేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. టెంపుల్ టౌన్‌గా ప్రసిద్ధి చెందాల్సిన సున్నిపెంట గ్రామంలో కూడా మద్యం దుకాణాలను తరలించడం శ్రేయస్కరంగా భావిస్తున్నట్లు సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఆలయ సంప్రదాయాలతో పాటు క్షేత్రాభివృద్ధికి పాటుపడుతున్న ధర్మకర్తల మండలి నిర్ణయాలను ముఖ్యమంత్రి అభినందించినట్లు చైర్మన్ చెప్పారు.

గర్జించిన ఆదోని

- జిల్లా కోసం బంద్ విజయవంతం
- స్వచ్ఛందంగా దుకాణాలు, ప్రైవేటు విద్యా సంస్థలు, కార్యాలయాలు మూసివేత
- ఆర్టీసీ బస్సులను అడ్డుకున్న జేఏసీ నాయకులు
- పాల్గొన్న వివిధ వర్గాల ప్రజలు, సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు



రోడ్డుపై బైఠాయించిన జేఏసీ, రాజకీయ పార్టీల నాయకులు

ఆదోని/ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆదోని జిల్లాను ఏర్పాటు చేయాలని ప్రజలంతా గర్జించారు. బుధవారం జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు పిలుపునిచ్చిన బంద్ విజయవంతం అయింది. దుకాణాలు, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. తెల్లవారుజాము అయిదు గంటలకే జేఏసీ నాయకులు ఆర్‌టీసీ డిపో వద్దకు చేరుకున్నారు. ఆర్‌టీసీ బస్సులు రోడ్డు ఎక్కకుండా అక్కడే బైఠాయించారు. ఉదయం 9గంటలకు టూ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఆర్టీసీ బస్సులను అడ్డుకున్న నాయకులను తప్పుకోవాలని సూచించారు. తాము బందుకు పిలుపునిచ్చామని ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించారు. ఆర్‌టీసీ బస్సులను అడ్డుకున్న నాయకులందరినీ బలవంతంగా తప్పించి రోడ్డెక్కించే ప్రయత్నం చేశారు. అరగంట పాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసు సిబ్బంది చేత బలవంతంగా విచక్షణ రహితంగా కొందర్ని లాగి పక్కకు తోసేశారు. న్యాయవాది నాగేంద్రయ్య, సీపీఐ వీరేష్, తిరుమలేష్, ఉదయ్ దేవిశెట్టి ప్రకాష్, సుజ్ఞానమ్మ, నాగరాజుగౌడ్, కునిగిరి నీలకంఠ, రత్నాబాయి, వెంకటేష్, శ్రీనివాసాచారితో మరికొంత మంది రోడ్డుపై అడ్డంగా పడుకున్నారు. పోలీసులు బలవంతంగా కొన్ని బస్సులను రోడ్డెక్కించారు. ప్రజలు వారి ప్రయత్నాలను తిప్పి కొట్టి బస్సులను అడ్డుకున్నారు. జేఏసీ నాయకులతోపాటు తెలుగుదేశం, వైసీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ తోపాటు వామపక్ష పార్టీలు విద్యార్థి, యువజన, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్స్ అసోసియేషన్, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, కాటన్ మర్చంట్ అసోసియేషన్, షరాఫ్ బజర్, కుల సంఘాల నాయకులు కదం తొక్కారు. జేఏసీ నాయకులు రఘురామయ్య, అశోక్ నంద రెడ్డి, కృష్ణమూర్తి, లలిత, నూర్ అహ్మద్, కోదండ, దస్తగిరి, విరుపాక్షి, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్‌తో పాటు టీడీపీ సీనియర్ నాయకుడు కొంకా ఉమాపతి, భూపాల్ చౌదరి, మరుతీ నాయుడు, సిద్ధార్థ నాయుడు, రంగస్వామి, జిందే శంకర్, ఆరేకల్ రామకృష్ణ, వెంకన్నగేరి మల్లికార్జున, బసాపురం రామస్వామి తదితరులు ఆర్‌టీసీ డిపో వద్దకు వచ్చి రోడ్డుపై బైఠాయించారు. వైసీపీ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, చలపతి, రామలింగేశ్వర యాదవ్, బీజేపీ నాయకులు కునిగిరి నీలకంఠ, నాగరాజుగౌడ్, అదూరి విజయ్ కృష్ణ, వెల్లాల మధుసూదన్ శర్మ, జనసేన నాయకులు రేను వర్మ, పులిరాజు, రాజశేఖర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, దిలీప్ శ్రీనిధి సాయినాథ్ అక్కడి నుంచి ర్యాలీగా వచ్చారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజవర్గాలను కలిపి ఆదోని జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు.

దీక్షలో క్రైస్తవ పాస్టర్లు



స్వచ్ఛందంగా మూసివేసిన బంగారు దుకాణాలు

జిల్లా సాధన సమితి చేపట్టిన రిలే దీక్షలు 25వ రోజు ఆదోని క్రైస్తవ పాస్టర్లు ఆనంద్ రాజు ఎజ్రా శ్రీధర్, బెనర్జీ రాజు, థామస్, రవి, జదిద్య, అనిల్, విల్సన్, విజయ్ తోపాటు కొంత మంది దీక్షలో కూర్చున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భీమాస్ కూడలి దిగ్బంధం

ఆదోని జిల్లాను ఏర్పాటు చేయాలంటూ రోడ్లన్నీ మార్మోగాయి. పదేళ్ల చిన్నారి నుంచి 90 ఏళ్ల ముదుసలి వరకు ఒకటే నినాదంతో భీమాస్ నుంచి శ్రీనివాస భవన్, నిర్మల్ టాకీస్, రైల్వే స్టేషన్‌ను దిగ్బంధనం చేశారు. మున్సిపల్ క్రీడా మైదానం నుంచి భారీగా తరలివచ్చిన ప్రజలతో ర్యాలీ చేపట్టారు.

టైర్లకు నిప్పు పెట్టి నినాదాలు

బీజేపీ నాయకులు భీమాస్ కూడలిలో టైర్లకు నిప్పు పెట్టి నినాదాలు చేశారు. వన్ టౌన్ సీఐ శ్రీరామ్ అక్కడ చేరుకొని నచ్చజెప్పి శాంతియుతంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చేయాలని సూచించారు.

సగమే సాగు

• రబీ ముగుస్తున్నా 41,078 హెక్టార్లే సాగు • ఖరీఫ్ నష్టాలతో ముందుకు సాగలేని రైతులు



ఓర్వకల్లు మండలంలో సాగు చేసిన శనగ

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో రబీ సాగు విస్తీర్ణం 1,78,094 హెక్టార్లు కాగా.. రబీ ముగిసిపోతున్నా కూడా కేవలం 41,078 హెక్టార్లకే (38 శాతాని)కే పంటల సాగు పరిమితమైంది. ఇటువంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదని వ్యవసాయ శాఖ అధికారవర్గాలు తెలిపాయి. గత ఖరీఫ్‌లో వర్షాలు, తుఫాన్లతో రైతులు భారీగా నష్టపోయారు. ఈ పరిస్థితి రబీ సీజన్‌లోనూ వెంటాడుతుందేమోనని రైతులు తీవ్ర ఆందోళన చెందారు. దీంతో పాటు రబీలో పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి బ్యాంకుల నుంచి అందకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు. చేతికందిన పంటలకు నామమాత్రంగానే మద్దతు ధర లభిస్తుండటంతో ప్రధాన పంటల సాగు పై రైతులు ఆసక్తి చూపించలేదు. అక్టోబరు నుంచి మొదలైన రబీ సాగు ఇప్పటికీ దాదాపు పూర్తి కావాల్సి ఉంది. అయితే.. సగం కూడా సాగు కాని పరిస్థితి జిల్లాలో నెలకొంది. వరి సాగు సాధారణ విస్తీర్ణం 4,314 హెక్టార్లు కాగా, కేవలం 15 హెక్టార్లు మాత్రమే ఇప్పటికీ సాగైంది. అదే విధంగా జొన్న 9,790 హెక్టార్లకు గాను 2,468 హెక్టార్లు సాగైంది. సజ్జ 788 హెక్టార్లుకు గాను 48 హెక్టార్లు మాత్రమే సాగైంది. మొక్కజొన్న 6,558 హెక్టార్లుకు గాను 2,912 హెక్టార్లలో సాగైంది. శనగ 59,608 హెక్టార్లకు గాను 33,079 హెక్టార్లలో, వేరుశనగ 15,499 హెక్టార్లకు 860 హెక్టార్లలో సాగైంది. పొద్దుతిరుగుడు 376 హెక్టార్లకు రెండు హెక్టార్లలోనే సాగు చేశారు. ఆముదం 129 హెక్టార్లకు గాను ఇంత వరకు ఒక్క హెక్టారులో కూడా విత్తనం పడలేదు. పొగాకు 1,743 హెక్టార్లు సాగు చేయాల్సి ఉండగా.. కేవలం 1,314 హెక్టార్లకే పరిమితమైంది. వాము 1,616 హెక్టార్లకు ఇంతవరకు ఒక హెక్టారులో కూడా విత్తనం వేయలేని పరిస్థితి నెలకొంది. మిరప 810 హెక్టార్లకు దారుణంగా 45 హెక్టార్లలో సాగు చేశారు. మొత్తం మీద రబీలో అన్ని పంటలు కేవలం 41,076 హెక్టార్లలోనే సాగు కావడం దారుణం.

కంది పంటకు ధర వస్తుందనే ఆశతో ...

కంది పంటకు కేంద్ర ప్రభుత్వం రూ.8వేల మద్దతు ధర ప్రకటించింది. దీంతో ఖరీఫ్‌లోనే ఈ పంట సాధారణ సాగు విస్తీర్ణం 69,530 హెక్టార్లు కాగా, ఖరీఫ్ నెలాఖరు నాటికి 1,11,757 హెక్టార్లలో ఈ పంటను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం ఈ పంట కాయదశలో ఉంది. దీనివలనే శనగ సాగు తగ్గిందని అధికారులు చెబుతున్నారు. మొత్తానికి రబీ సీజన్‌లో ప్రధాన పంటల సాగు తగ్గిపోవడంపై



వ్యవసాయాధికారులు ఆందోళన చెందుతుందన్నారు.

మిగిలిపోయిన 110 క్వింటాళ్ల విత్తనం

ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు ప్రధాన పంటలకు సంబంధించి రాయితీపై విత్తనాలు అందజేస్తుంది. అయితే.. ఈసారి రబీ సీజన్‌లో రాయితీ విత్తనాలను రైతులకు అందించేందుకు ఏపీ సీడ్స్ సంస్థ చర్యలు తీసుకున్నా రైతుల నుంచి పెద్దగా ఆసక్తి కనిపించలేదు. మార్కెట్‌లో లభించే ధరనే ప్రభుత్వం నిర్ణయించడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లి విత్తనాలు తీసుకునేందుకు ఆసక్తి చూపలేదు. జిల్లాలో రబీ సీజన్‌లో 22 మండలాల రైతులు శనగ పంటను సాగు చేస్తారు. వీరి కోసం ఏపీ సీడ్స్ సంస్థ 23,898 క్వింటాళ్ల విత్తనాలను కేటాయించింది. ఈ రాయితీ విత్తనాలను 15 మండలాల్లోనే రైతులు తీసుకున్నారు. హొళగుంద, హాలహర్వి, ఎమ్మిగనూరు, క్రిష్ణగిరి, నందవరం, గోనెగండ్ల తదితర మండలాల్లో రైతులు ఎవరూ విత్తనం కోసం ఆసక్తి చూపలేదు. మొత్తం మీద లక్ష్యంలో సగం 12,786 క్వింటాళ్ల విత్తనాలను మాత్రమే రైతులు తీసుకున్నారు. 11,110 క్వింటాళ్ల విత్తనం మిగిలిపోయింది. నంద్యాల జిల్లాలో 24 మండలాలకు గాను 12,314 క్వింటాళ్ల రాయితీ విత్తనాలను కేటాయించారు. అయితే.. ఆళ్లగడ్డ, చాగలమర్రి, ప్యాపిలి తదితర మండలాల రైతులు విత్తనాలను తీసుకోలేదు. కేవలం 11,878 క్వింటాళ్ల విక్రయమే జరిగింది. కర్నూలు జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో ప్రధాన పంటల సాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోయింది. శనగ పంట సాగు 59,608 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు కేవలం 34,027 హెక్టార్లలోనే సాగైంది. నంద్యాల జిల్లాలో 59,881 హెక్టార్లుకు గాను కేవలం 45,549 హెక్టార్లలోనే ఈ పంట సాగు కాడం గమనార్హం.

భార్య కాపురానికి రాలేదని..

• వ్యక్తి బలవన్మరణం

బేతంచర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రాలేదని మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని హెచ్ కొట్టాల గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వ రశెట్టి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన వడ్డే చల్లా తిరుమలేష్(31) మంజుల పుట్టింటికి వెళ్లి ఏడాదైనా తిరిగి కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య మంజుల, ఒక కొడుకు, కుమార్తె సంతానం ఉన్నారు. మృతుడి తండ్రి వెంకట్రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

సీఐ తిట్టాడని.. మహిళ ఆత్మహత్యాయత్నం

నంద్యాల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఒక సీఐ తనను బూతులు తిట్టడాని మనస్తాపానికి గురై ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలు షమీం తెలిపిన వివరాలు.. పట్టణంలోని నడిగడ్డకు చెందిన హుసేన్ తనకు రూ.4లక్షలు ఇవ్వాలని ఇటీవల పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో వారు సదరు పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. కేసు విషయమై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన బాధితురాలిని ఆ సీఐ బూతులు తిట్టడాని మనస్తాపం చెంది సెల్ఫీ వీడియో తీసుకొని విషద్రావణం తాగి ఆత్మహత్నాయత్నానికి పాల్పడినట్లు తెలిపింది. బంధువులు చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈవిషయమై ఆ సీఐని వివరణ అడగగా బాధితురాలి కేసును విచారణ చేస్తున్నామని ఆమెను ఎలాంటి బూతులు తిట్టలేదని స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా సిబ్బంది నడుచుకున్నారని తెలిపారు. రూ.4లక్షలు కూడా ఒక కేసులో ముద్దాయిగా ఉన్న తన భర్త షంపీర్‌ను బయటకు తీసుకురావడానికి హుసేన్‌కు ఇచ్చినట్లు నిర్ధారించినట్లు సీఐ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఓర్వకల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై మండలంలోని కాల్వబుగ్గ గ్రామ బస్టాండు వద్ద చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన మేకల వెంకటేశ్వర్లు (36) బుధవారం సాయంత్రం రోడ్డు దాటుతున్నాడు. కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి అతడిని ఢీకొట్టింది. అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరిపై కిడ్నాప్ కేసు నమోదు

• కారు, సెల్ ఫోన్, డమ్మీ తుపాకీ స్వాధీనం

చాగలమర్రి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.తాండ గ్రామానికి చెందిన శివరామనాయక్ అనే వ్యక్తిని మండలంలోని గొడిగనూరు గ్రామానికి చెందిన చరణ్, యేసయ్య అనే వ్యక్తులు కత్తి, డమ్మీ గన్నుతో బెదిరించి కిడ్నాప్ చేసిన సంఘటనలో ఇద్దరిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఐ సురేష్ చెప్పిన దాని ప్రకారం.. ఎం.తండా గ్రామానికి చెందిన వెంకటేష్ నాయక్‌కు చెందిన 4.6 ఎకరాల పొలాన్ని రూ.25.8 లక్షలకు బేరం చేసి మూడున్నరేళ్ల కిందట రాజునాయక్‌కు విక్రయించాడు. అప్పుడు రాజునాయక్ రూ. 20 లక్షలు ఇచ్చి రూ.5.8 లక్షలు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టాడు. రెండు నెలల లోపు ఆన్‌లైన్ చేయిస్తే మిగిలిన డబ్బులు ఇస్తానని చెప్పాడు. వెంకటేష్‌నాయక్ మూడున్నర సంవత్సరాలుగా మిగిలిన డబ్బు ఇమ్మని తిరగడంతో రాజునాయక్ ఇవ్వనని, అగ్రిమెంట్ ప్రకారం ఇవ్వనని చెప్పడంతో వెంకటేష్‌నాయక్ పొలంలో విత్తనాలు వేసేందుకు వెళ్లాడు. దీంతో రాజునాయక్, అతడి అక్క ఎం. తాండ సర్పంచ్ శంకరమ్మబాయి, బావ లక్ష్మన్‌నాయక్‌తో కలిసి కిడ్నాప్ కుట్ర పన్నారు. గొడిగనూరు గ్రామానికి చెందిన చరణ్, యేసయ్య అనే వ్యక్తులు వెంకటేష్‌నాయక్ సోదరుడైన శివరామ్‌నాయక్, మరో వ్యక్తి కలిసి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా కారులో వెళ్లి శెట్టివీడు గ్రామ సమీపంలో అడ్డుపడి బెదిరించి దాడి చేశారు. ఎవరికైనా చెబితే అంతుచూస్తామన్నారు. అక్కడినుంచి శివరామ్‌నాయక్ తప్పించుకొని పారిపోయి తన సోదరుడు వెంకటేష్‌నాయక్‌కు తెలపడంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై శివరామ్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చరణ్, యేసయ్యలపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరిద్దరితో కుట్ర పన్నిన లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్ శంకరమ్మబాయి, సోదరుడు రాజునాయక్‌లపై మరో కేసు నమోదు చేశామని అన్నారు. నిందితుడు చరణ్‌కుమార్‌ను చాగలమర్రి కస్తూర్బా పాఠశాల సమీపంలో అదుపులోకి తీసుకొని కారు, సెల్‌ఫోన్, డమ్మీ తుపాకీని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని ఎస్ఐ పేర్కొన్నారు.

కురువలకు ఎస్సీ హోదా ఇవ్వాలి

• కేంద్ర మంత్రికి ఎంపీ బస్తిపాటి నాగరాజు వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ

కర్నూలు అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కురువ, మాదాసి కురువ కులాలకు ఎస్సీ హోదా కల్పించి, తగిన కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయడంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్‌ను కోరారు. బుధవారం డిల్లీలో పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో పాల్గొంటున్న ఎంపీ కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్‌ను ఎంపీ కలిసి ఈ మేరకు కలిసి ఓ వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కులధృవీకరణ పత్రాల కోసం కురువ సంఘాలు ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నాయని, ఎస్సీ హోదా లభించకపోవడంతో విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పొందడంలో కురువలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు.

25 క్వింటాళ్ల పత్తి దగ్ధం

• రూ. 2.5 లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన పత్తిని చూపుతున్న బాధితులు

గోనెగండ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలువాల గ్రామంలో వడ్ల యల్లయ్యకు చెందిన పత్తి పంటకు ప్రమాదవశాత్తు నిప్పుఅంటుకొని దాదాపు 25 క్వింటాళ్ల పత్తి పంట దగ్ధమైంది. రూ. 2.50 లక్ష ఆస్తినష్టం వాటిల్లింది. బాధితుడు వడ్ల ఎల్లయ్య తెలిపిన వివరాలు.. తనకున్న ఏడెకరాల పొలంలో పత్తి సాగు చేశాడు. దాదాపు 25 క్వింటాళ్ల పైగానే పత్తి దిగుబడి వచ్చింది. సీసీఐ అమ్మకం జరిపేందుకుగాను ఈనెల 17న రిజిస్టర్ చేసుకున్నాడు. పత్తి కొంతతేమగా ఉం డటంతో బుధవారం ఉదయం పత్తిని తన ఇంటి ఆరుబయట ఆరవేశాడు. మధ్యాహ్నం వేళ ప్రమాదవశాత్తు ఆరవేసిన పత్తిపై నిప్పురవ్వలు పడ్డాయి. దీన్ని గుర్తించే లోపే మంటలు వ్యాపించి పత్తి దగ్ధమైంది. దీన్ని గమనించిన ఆ ప్రాంతవాసులు మంటలను ఆర్పివేశారు. కష్టపడి పండించిన పంట కళ్లముందే కాలిపోతుండటంతో రైతు యల్లయ్య బోరున విలపించాడు. దాదాపు రూ. 2.50 లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్

• 6. 5 తులాల బంగారు ఆభరణాలు అందజేత



బస్సు డ్రైవర్, ఎస్ఐను సన్మానిస్తున్న బాధితులు

వెల్దుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణికురాలు పోగొట్టుకున్న బంగారు ఆభరణాలను బాధితురాలికి అందజేసి ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామానికి చెందిన రామాంజనమ్మ సోమవారం కోడుమూరు వెళ్లే బస్సు ఎక్కింది. వెంకటగిరి గ్రామం నుంచి కోడుమూరుకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండడంతో కండక్టర్ ప్రయాణికులను వెంకటగిరిలో దింపారు. వెంకటగిరి నుంచి ఆటోలో కోడుమూరుకు చేరుకొని అక్కడి నుంచి ఆటోలో ప్యాలకుర్తికి వెళ్లారు. ప్యాలకుర్తికి వెళ్లిన తరువాత బ్యాగు చూసుకుంటే బంగారు ఆభరణాలు కనపడలేదు. వెంటనే కోడుమూరుకు చేరుకొని బస్సులో వెతికింది. డ్రైవర్, కండక్టర్‌లను అడగగా బస్సులో కనపడలేదని చెప్పారు. రాత్రి డోన్‌లో డిపోలోకి వెళ్లేటప్పుడు డ్రైవర్ శ్రీనివాసులు నిశితంగా తనిఖీ చేయగా బస్సులో ఒక బాక్సు దొరికింది. అందులో బంగారు ఆభరణాలు ఉండడంతో డిపోలో ఉన్న తనిఖీ అధికారులకు అందజేశారు. డిపో మేనేజరు బుధవారం వెల్దుర్తి ఎస్ఐ నరేశ్‌కు సమాచారం అందజేశారు. బుధవారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేయడానికి వెళ్లిన బాధితులు చెప్పిన వివరాలు సరిపోలడంతో ఎస్ఐ నరేశ్, డ్రైవర్ శ్రీనివాసులును పిలిపించి బాధితులకు ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు అప్పగించారు. డ్రైవర్ శ్రీనివాసులును, ఎస్ఐ నరేశ్‌ను బాధితులు బుధవారం సాయంత్రం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు.

భవన యజమానులకు నోటీసులు



ఓ భవనానికి వేసిన బీపీఎస్ ముద్ర

ఎమ్మిగనూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలో ప్లాన్ అప్రూవల్‌కు విరుద్ధంగా అక్రమ కట్టడాలు నిర్మించిన భవన యజమానులకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీచేశారు. ఈ సందర్భంగా టీపీవో(టౌన్ ప్లానింగ్ అధికారి) రాజేష్ మాట్లాడుతూ పట్టణంలో 1985 నుంచి ఇప్పటివరకు నిబంధనలకు విరుద్ధంగా గృహాలు, దుకాణాలు, భవనాలు నిర్మిం చిన వారిని గుర్తించామన్నారు. ఇప్పటికే దాదాపు 150మందికి నోటీసులు జారీ చేశామని అన్నారు. అక్రమ కట్టడాలు నిర్మించిన మరి కొంతమందికి నోటీసులు జారీ చేయ నున్నట్లు తెలిపారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారు వాటిని బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం)ద్వారా సక్రమం చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిం చిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్లాన్ అప్రూవల్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారు వెంటనే మున్సిపాలిటీ, సచివాలయం అధికారులను కలిసి బీపీఎస్ ద్వారా సక్రమం చేసుకోవాలని, లేని పక్షంలో తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

క్రిష్ణగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ రైతు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. వివరాలు.. తొగర్చేడు గ్రామానికి చెందిన రైతు రాజశేఖర(37) పదెకరాల భూమి ఉంది. ఐదేళ్ల నుంచి వర్షాలు సరిగ్గా కురవక, అధిక వర్షాలకు పంటలు చేతికి రాక నష్టపోయాడు.

పంటల సాగుకు చేసిన అప్పులు గుదిబండలా మారడంతో దిక్కుతోచక మనస్తాపం చెందాడు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికిభార్య మంగమ్మ, ఇద్దరు కుమార్తెలు భార్గవి, గౌతమి, కుమారుడు కార్తిక్ ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రైవేటు బ్యాంక్ మేనేజర్‌పై కేసు

ఆళ్లగడ్డ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వరిగో ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ మేనేజర్ నారాయణరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ నగీనా బుధవారం తెలిపారు. ఆమె చెప్పిన వివరాలివీ.. సంస్థలో పని చేసే ఇమ్మానుయేలు అనే ఉద్యోగి ఖాతాదారులు చెల్లించాల్సిన మొత్తాన్ని వసూలు చేసి సంస్థలో పని చేసే ఫీల్డ్ ఆఫీసర్‌కు ఇచ్చాడు. వారు ఆ సొమ్మును మేనేజర్ నారాయణరెడ్డికి ఇవ్వగా ఈ మొత్తాన్ని సంస్థ ముఖ్య ఖాతాలో జమ చేయ్యకుండా సొంతానికి వాడుకున్నాడు. ఖాతాదారులు చెల్లింపు వివరాలు తెలుసుకోవడంతో అందులో తాము ఇచ్చిన మొత్తం జమ కానట్లు తేలింది. దీనిపై సంస్థ ముఖ్య అధికారులకు ఫిర్యాదు చేయగా.. వారి ఆదేశాల మేరకు మేనేజర్ నారాయణరెడ్డిపై కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

కోవెలకుంట్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరు గ్రామానికి చెందిన ఓ మహిళ విష ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన కోవెలకుంట్ల పట్టణంలో బుధవారం జరిగింది. బండిఆత్మకూరు గ్రామానికి చెందిన రామేశ్వరమ్మ(51) భర్త పది సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఉన్నందు వల్ల వారికి ఉన్న పొలం అమ్మి ఒక కూతురుకు వివాహం చేసింది. మరో కూతురును చదివిస్తోంది. ఆర్థిక ఇబ్బందితో బాధపడుతూ ఉండేది. కోవెలకుంట్లలో ఉన్న చెల్లెలు దగ్గరికి వచ్చి మనస్తాపానికి గురై ఆత్మహత్యయత్నం చేసింది. ఆస్పత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందిందని తెలిపారు. రామేశ్వరమ్మ కూతురు భావన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎక్సైజ్ సీఐ మృతి



టక్కీ బాషా(ఫైల్)

కోవెలకుంట్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల ఎక్సైజ్ సీఐగా పని చేస్తున్న టక్కీ బాషా బుధవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు ఇన్‌చార్జ్ సీఐ సందీప్ తెలిపారు. ఎక్సైంజ్ సీఐగా కోవెలకుంట్లలో పని చేస్తున్న టక్కీ బాషా గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై సెలవు పెట్టి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉండేవాడని, కోలుకోలేక మృతి చెందినట్లు ఆయన తెలిపారు.

మళ్లీ చొరబడేందుకు ప్రయత్నాలు

• సిఫారసు లేఖలతో ప్రత్యక్షమైన దళారులు
• రైతుబజారు సెక్యూరిటీ గార్డులపై దౌర్జన్యం
• దళారులను హెచ్చరించిన పోలీసులు



దళారులను హెచ్చరిస్తున్న మార్కెటింగ్ అధికారులు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతుబజారు నుంచి బయటకు వెళ్లిపోయిన దళారులంతా మళ్లీ చొరబడేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్యేలతో సిఫారసు లేఖలను రాయించుకుని వచ్చి సి.క్యాంపు రైతుబజారులో మళ్లీ తమకు చోటు కల్పించాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు. మా స్థానంలో కూర్చున్న రైతులను బయటకు పంపాలని రైతుబజార్ ఎస్టేట్ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తుండటంతో వారు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. బుధవారం ఆత్మకూరు ఎమ్మెల్యే ఇచ్చిన సిఫారసు లెటరుతో ఓదళారి వచ్చి రైతును బయటకు పంపి తనకు చోటును కల్పించాలని ఎస్టేట్ అధికారితో వాగ్వాదానికి దిగారు. ఈ వ్యవహారంలో ఆ దళారి ఓ సెక్యూరిటీ గార్డుపై దౌర్జన్యానికి దిగారు. మరో దారి లేక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ శేషయ్యకు ఫిర్యాదు చేశామని ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ విలేకరులకు తెలిపారు. సీఐ ఆదేశాలతో రైతుబజారుకు వచ్చిన పోలీసులు దళారులను హెచ్చరించి రైతులకు ధైర్యం చెప్పారు. రైతుబజారులో మొదటి ప్రాధాన్యం రైతులకే కల్పించాలని, తర్వాత పొదుపులక్ష్మి మహిళలు, మిగిలినవారికి చోటు కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అధికారులు తెలిప్పారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు కూడా రైతుల పక్షాన నిలబడితే బాగుంటుందని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏపీఎస్పీడీసీఎల్‌కు వినియోగదారుల కమిషన్ వడ్డింపు

కర్నూలు లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవాలయానికి విద్యుత్ కనెక్షన్ దీర్ఘకాలికంగా ఇవ్వకుండా సేవాలోపం చేసిన ఏపీఎస్పీడీసీఎల్‌కు జిల్లా వినియోగదారుల కమిషన్ తగిన రీతిలో వడ్డించింది. రుద్రవరం మండలం పేరూరులో సత్యనారాయణ స్వామి దేవాలయానికి విద్యుత్ కనెక్షన్ కోసం ఆలయ ధర్మకర్త గంగిశెట్టి రమేష్ 2019లో రూ.10,035ను డిపాజిట్ చేశారు. తర్వాత ఫిర్యాది ఎన్నిమార్లు విన్నవించుకున్నా అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇవ్వ లేదు. 2022-23 మధ్యకాలానికి కనెక్షన్ ఇవ్వకుండానే విద్యుత్ బిల్లు జారీ చేశారు. దీంతో ఫిర్యాది వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కేసును విచారించిన కమిషన్ డిపాజిట్ వసూలు చేసికూడా కనెక్షన్ ఇవ్వకుండా ఆలస్యం చేయడం సేవాలోపం చేయడమే అవుతుందని నిర్ధారించింది. దీంతో దేవాలయానికి 45 రోజుల్లోగా విద్యుత్ కనెక్షన్‌ను మంజూరు చేయడమే కాకుండా ఫిర్యాదిదారుడికి మానసిక వేదన కింద రూ.15వేలు, కోర్టు ఖర్చుల కింద మరో రూ.5వేలను ఫిర్యాదికి చెల్లించాలని కమిషన్ అధ్యక్షుడు కరణం కిషోర్‌కుమార్, సభ్యులు ఎన్. నారాయణ రెడ్డి, నజీమా కౌసర్ ఆదేశాలు జారీ చేశారు.

చోళమండలం ఎంఎస్ జనరల్ బీమా కంపెనీకి..

జిల్లాలోని జిల్లెడుబుడకల గ్రామానికి చెందిన బీమాదారుడు లారీ ప్రమాదంలో మృతి చెందినా, కారణాలు చెప్పకుండా ఇన్సూరెన్స్ మొత్తం చెల్లించకపోవడం సేవాలోపం అవుతుందని జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్మానించింది. గ్రామానికి చెందిన మృతుడు లారీ డ్రైవర్‌గా పని చేస్తూ 2023 మే 31వ తేదీ రాత్రి లారీని నడుపుతుండగా.. రోడ్డుపై ఆకస్మాత్తుగా కుక్క దూసుకువచ్చి వాహనం అదుపు తప్పి ఒరిగిపోయింది. ఘటనాస్థలిలోనే డ్రైవర్ మరణించాడు. మృతుడి భార్య చోళమండలం బీమా కంపెనీకి బీమా మొత్తం రూ.15లక్షల కోసం దరఖాస్తు చేసుకుంది. అవసరమైన పత్రాలన్నీ సకాలంలో అందజేసినా కంపెనీ క్లెయిమ్‌ను పరిష్కరించకుండా దీర్ఘకాలికంగా పెండింగ్ ఉంచింది. మృతుడి భార్య వెంకటేశ్వరమ్మ జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించింది. కేసును విచారించిన కమిషన్ ఫిర్యాది అన్నిపత్రాలు సక్రమంగా దాఖలుచేసినా కూడా బీమా మొత్తం ఇవ్వకపోవడం సేవాలోపం అవుతుందని నిర్ధారించింది. ఫిర్యాదికి బీమా మొత్తం రూ.15లక్షలను 9శాతం వడ్డీతో చెల్లించాలని, మానసిక వేదనకు గురి చేసినందుకు రూ.25వేలు, కోర్టు ఖర్చుల కింద మరో రూ.5 వేలను 45 రోజుల్లోపు అందజేయాలని కమిషన్ అధ్యక్షుడు కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్ ఆదేశాలు జారీ చేశారు.

నగరం.. నరకం



డ్రైవర్‌సాబ్ బస్సు ఆపేది ఎక్కడ? కలెక్టరేట్ వద్ద ఇలా..

- పుట్‌పాత్‌ల ఆక్రమణ, రోడ్డుపైనే ప్రయాణికులు
- రోడ్డుకు అడ్డంగా, ఆర్టీసీ బస్సులు, ఆటోల నిలిపివేత..
- పౌరుల అవస్థలు



ఇప్పుడు ఏమైంది.. గతంలో నగరంలో ఆటోల కోసం ప్రత్యేక దారి



సి. క్యాంపు సెంటర్‌లో నడిరోడ్డుపై వేచి ఉన్న ప్రయాణికులు



మా ఇష్టం.. సి.క్యాంపు సెంటర్ బస్‌స్టాప్‌లో ప్రైవేటు వాహనాలు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రదాన రహదారు పుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధాన కూడళ్లు కలెక్టరేట్, సి.క్యాంపు బస్‌స్టాప్‌ల వద్ద పుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకోవంతో ప్రయాణికులు రోడ్డుకు అడ్డంగా నిలబడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రయాణికులపై వాహనాలు దూసుకెళ్లిన సంఘటనలు ఉన్నాయి.ఇ సి.క్యాంపు సెంటర్ బస్‌స్టాప్‌లో ప్రైవేటు వాహనాలు అడ్డంగా నిలుపుతున్నారు. ఆర్టీసీ బస్సులు నడిరోడ్డుపై నిలపడంతో తరచుగా ట్రాఫిక్ జామ్ అవుతోంది.

పత్తాలేని ట్రాఫిక్ పోలీసులు.

నిత్యం రద్దీగా ఉండే కూడళ్లలో ఉండాల్సిన ట్రాఫిక్ పోలీసులు కనిపించడం లేదని నగర పౌరులు విమర్శిస్తున్నారు. పోలీసులకు ప్రతి నెలా ముడుపులు అందుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో ఆటోలకు ప్రత్యేకమైన దారి ఉండేది, మరిఏమైందో అది కనుమరుగైంది. ఇప్పటికైనా పోలీసులు ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పౌరులు కోరుతున్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ అధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. బుధవారం 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయమనోహరి పాల్గొన్నారు. వైద్య కళాశాలల



సంతకాలు సేకరిస్తున్న ఎస్వీ విజయ మనోహరి

ప్రైవేటీకరణతో సామాన్య, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కార్పొరేటర్ మునెమ్మ, మల్లి, శేఖర్, రాధికమ్మ, వాహిదా, రాజేష్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



కోట్ల సర్కిల్‌లో క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

కోడుమూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ఆదుకున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు ఎల్లప్ప, సురేష్‌నాయుడు అన్నారు. బుధవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సదర్భంగా పట్టణంలోని కోట్ల సర్కిల్‌లో సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం, వెలుగు కార్యాలయంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. దివ్యాంగులకు పిచన్ పెంచారని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అమరావతిలో దివ్యాంగుల భవన్, బ్యాంకు రుణాలు, బ్యాటరీ వాహనాలు ఇచ్చారన్నారు. టీడీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, గంగాధర్‌నాయుడు, మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ ఎల్లప్పనాయుడు, బడేసాగౌడ్, రవీంద్రగౌడ్, బ్రిటిష్‌రాముడు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించడం అభినందనీయం



గెలుపొందిన క్రీడాకారులతో నాయకుడు సులేమాన్

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల్లో రాణించి పాఠశాలకు పేరు తీసుకురావడం అభినందనీయమని టీడీపీ మైనార్టీ నాయకుడు సులేమాన్ అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ బాలికల పాఠశాలలో అంతర్ జిల్లా వాలీబాల్ పోటీల్లో విద్యార్థినులను అభినందించారు. 9వ తేదీన కర్నూలులో జరిగిన ప్రథమస్థానం పొందిన ట్రోఫీ సాధించారన్నారు. హెచ్‌ఎం సారధి శర్మ, పీడీలు శ్రీనివాసులు, సిరాజ్ విద్యార్థినులు రాజేశ్వరి, ముబీనా, వైష్ణవి, కళ్యాణి, అనూష, రజియా ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్



మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

కల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. బుధవారం కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో మధు అధ్యక్షతన జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా మార్చిన దుర్మార్గమైన బీజేపీ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణ, షేక్షావలి, శ్రీనివాసులు, రాజశేఖర్, కోటి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పేరు ఉన్నవారే పనికి రావాలి

సి.బెళగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డులో పేరున్నవారే ఉపాధి పనికి వచ్చేలా చూడాలని ఎంపీడీవో రాణెమ్మ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వమించారు. జాబుకార్డున్న కూలీలందరికీ ఈకేవైసీ చేయాలన్నారు. కూలీలు వసలు వెళ్లకుండా ఇక్కడే పనులు చేసుకోవాలని సూచించారు. ఏపీవో రామన్న, ఈసీ రంగస్వామి ఉపాధి సిబ్బంది ఉన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి. రామక్రిష్ణ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద జి. సింగవరం సర్పంచ్ అధ్యక్షతన రైతులతో కలిసి ధర్నా చేశారు. రూ.20 వేలకుపైగా ఎకరాల్లో సాగుచేశారని, పెట్టుబడి కూడా రావడం లేదన్నారు. ప్రైవేట్ వ్యాపారులు రూ.1,300 నుంచి రూ.1,500లు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ. 2,450లు ప్రకటించినా అమలు కావడం లేదన్నారు. అనంతరం కలెక్టర్ డా.సిరికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, రైతులు వీరన్న, నరేంద్ర, టి. వెంకటేశ్వర్లు, బి.సోమన్న, శ్రీనివాసులు, ఖాజాపీరా తదితరులు పాల్గొన్నారు.

హక్కులను అందరూ వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి

కర్నూలు అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవ హక్కులను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. క్రీ.శ.1215లో ఇంగ్లండ్‌లో హక్కుల మాగ్నాకార్ట మొదటిసారిగా ప్రకటించారని, తర్వాత గ్లోరియన్ రెవల్యూషన్, ఫ్రెంచి విప్లవం , రష్యా విప్లవం ఉద్యమాలు చేశారన్నారు. 1948 డిసెంబర్ 10న ప్రపంచ మానవ హక్కుల దినోత్సవంగా నిర్వహించు కుంటారని తెలిపారు. అర్థశాస్త్ర విభాగాధిపతి ఆర్ రోషన్న, నాగరత్నమ్మ, వైస్ ప్రిన్సిపాల్ జె. హేమంత్ , ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఫకృన్నీ బేగం, అకాడమిక్ కోఆర్డినేటర్ ఎ. వెంకటస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

హైకోర్టు బెంచ్ ప్రజల ఆకాంక్ష

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కర్నూలు ప్రజల చిరకాల ఆకాంక్షాక్ష అని జాతీయ లంబాడి సంఘం రాష్ట్ర కార్యదర్శి యోగేష్ నాయక్, ఎరుకుల కుశాల్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ ఏ, బీ, సీ ప్రభుత్వ క్వార్టర్స్‌లోనే బెంచ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మంత్రి టీజీ భరత్ నగరాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారని ప్రశంసించారు. జిల్లాకు పరిశ్రమలు రావడం వల్ల నిరుద్యోగులకు ఉపాధి అవకాశం లభిస్తుందన్నారు.



మాట్లాడుతున్న యోగేష్, కుశాల్

రైతులు ఈకేవైసీ చేయించాలి



పొలం పిలుస్తోందిలో పాల్గొన్న వ్యవసాయాధికారులు

సి.బెళగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రబీలో పంటలు సాగుచేస్తున్న రైతులు ఈకేవైసీ తప్పక చేయించాలని ఏవో మల్లేష్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని సంగాల గ్రామంలో 'పొలం పిలు స్తోంది' నిర్వహించారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పొలం పిలుస్తోంది నిర్వహిస్తోందన్నారు. మొక్కజొన్న, వేరుశనగ, శనగ రైతులకు అవగాహన కల్పించారు. ఎంపిఈవోలు రైతులు ఉన్నారు.

ఆదోని జిల్లా ప్రకటించాలి

కర్నూలు అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆదోనిని తక్షణమే జిల్లాగా ప్రకటించాలని రాయలసీమ విద్యార్థిపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ మదాసి కురువ సుంకన్న, రంగమునితో కలిసి మాట్లాడారు. పశ్చిమ ప్రాంతమైన ఆదోని ప్రాంతాల వాసులు జిల్లా కేంద్రాననికి చేరుకోవాలంటే వందకు పైగా కిలోమీటర్లు ప్రయాణించి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాము, రాజేంద్ర ప్రసాద్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

చదువుతో పాటు క్రీడలు ముఖ్యం



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ జస్మిత్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని డిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జస్మిత్ తెలిపారు. బుధవారం పాఠశాల క్రీడా మైదానం లో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా క్రీడల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థు ఆరోగ్యం కోసం తల్లిదండ్రులు క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ రెండో రోజు జరుగుతున్న పోటీలో అధికంగా క్రీడాకారులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కర్నూలు అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని వైసీపీ విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి కటికె గౌతమ్ డిమాండ్ చేశారు. బుధవారం వైఎస్ఆర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద చస్తున్న నిరసను భగ్నం చేయడం హేయమైన చర్యఅని మండి పడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చడం మరచి అక్రమ అరెస్టులతో కక్ష సాధింపు చర్యలకు ప్పాలడు తోందని ఎద్దేవా చేశారు. డిసెంబరు నాటికి రూ.56 వేల కోట్లు బకాయి లుంటే ప్రభుత్వం విడుదల చేసింది కేవలం రూ.700 కోట్లు మాత్రమేన న్నారు. ఆర్పీపీ నగర అధ్యక్షులు అన్సార్ బాషా, బోయ శ్రీదర్, కోట్ల మదుకూమార్, బోయ శోక్ కుమార్, కంటు, సోషల్ మీడియా రాంబాబు, బండిమెట్ట మధు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర బాక్సింగ్ పోటీలకు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురుషుల బాక్సింగ్ పోటీలకు గురువారం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు సురేష్ గౌడ్, చైర్మన్ పి.విజయ కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. కర్నూలులోని అవుట్ డోర్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని, 19 నుంచి 40 సంవత్సరాలలోపు వారు అర్హుల న్నారు. 2006 సంవత్సరానికి ముందుగా జన్మించినవారై ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు 13, 14 తేదీల్లో విజయవాడలోని లయోలా కాలేజీలో నిర్వహించే సీనియర్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు జగదీష్‌ను 9063012013 నెంబర్లో సంప్రదించాలన్నారు.

జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా అబివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన, జిల్లాల పునర్విభజనతో అత్యంత వెనుకబడిన జిల్లాగా కర్నూలు మారిందన్నారు. జిల్లాలో ప్రజా ప్రతినిధులు ఉన్నా, నిధులు కేటాయించి అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. రాబోయే కాలంలో నిధులు కేటాయింపుపై పాలకులపై ఒత్తిడి తీసుకురావడానికి ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు.

సెపక్‌తక్రా ఫెడరేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసులు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): డిల్లీలో జరిగిన అఖిల భారత సెపక్ తక్రా ఫెడరేషన్ అధ్యక్షుడిగా జి.శ్రీనివాసులు ఎంపిక య్యారు. ఆంధ్ర ప్రదేశ్ నుంచి ఐదుసార్లు జాతీయ స్థాయి పోటీలు, సౌత్‌జోన్ పోటీలు నిర్వహించిన కారణంగా తనను ఎన్నుకున్నామన్నారు.



భారత హాకీ మాజీ కెప్టెన్‌ను కలిసిన కార్యదర్శి



దిలీప్‌తో దాసరి సుధీర్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ హాకా మాజీ కెప్టెన్ దిలీప్ టర్కీని కలిశారు. హాకీ వరల్డ్ కప్ పోటీల సందర్బంగా ముంబైలో భారత హాకీ సంఘం అధ్యక్షుడు, మాజీ కెప్టెన్ దిలీప్ టర్కీతో కలిసి జిల్లాలో హాకీ క్రీడ అభివృద్ధి విషయాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా హాకీ ప్రతినిధులు సుధీర్, చాణిక్య దాస్ ఉన్నారు.

పెద్దాసుపత్రిలో ఆదమరిస్తే అంతే!



ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎంసీహెచ్ బ్లాక్, ఫార్మసీ దారిలో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. మాతా శిశు కేంద్రం, ఔషధ శాలకు వెళ్లే దారి నిత్యం రద్దీగా ఉంటుంది. చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలు రోగులు మందుల కోసం వస్తుంటారు. మ్యాన్‌హోల్‌పై ఏర్పాటు చేసిన గ్రిల్ కుంగిపోయింది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా మ్యాన్‌హోల్‌లో పడిపోయే ప్రమాదం ఉంది. ఆసుపత్రి అధికారులు స్పందించి మ్యాన్ హోల్‌పై కొత్త గ్రిల్‌ను ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు. **- కర్నూలు హాస్పిటల్**

వైసీపీలో చేరారన్నది అవాస్తవం

సి.బెళగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబందహాల్ గ్రామ టీడీపీ కార్యకర్తలు వైసీపీలో చేరారన్నది అవాస్తవమని తాము టీడీపీలోనే ఉన్నామని ఆ పార్టీ కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ తమ ఉనికిని కాపాడుకోడానికే వైసీపీ నాయకులు అబద్దపు ప్రచారం చేస్తున్నారన్నారు. కోడుమూరు నియోజకవర్గ టీడీపీకి కంచుకోట అని, దీన్ని బద్ధలు కొట్టడం వైసీపీకి అసాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు యాకోబు, ధనుంజయుడు, నాయకులు హరి, అమర్, ఈరన్నగౌడ్ ఉన్నారు.



ఫొటోలను చూపుతున్న టీడీపీ నాయకులు

బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి నాయకులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్‌యూ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున ఆర్వీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డిమాండ్ చేశారు. బుధవారం రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడుకు వినతి పత్రం ఇచ్చారు. ప్రైవేట్ బీఈడీ కళాశాలల యాజమాన్యాలు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఫ్యాకల్టీ, లైబరీ, ల్యాబ్, ప్రాక్టికల్స్ లేకుండానే నిర్వహిస్తున్నారన్నారు. మధు, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్నాథం డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ నగర సహాయ కార్యదర్శి మహేష్ అధ్యక్షతన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. దేశానికి అన్నం పెట్టే రైతు కష్టాలు తీర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా ఆందోళన చేశారారు. ఉల్లి, పత్తి, మిరప, వాణిజ్య పంటలకు ధర లేక రైతులు అల్లాడుతున్నారన్నారు. కల్తీ ఎరువులు, కల్తీ మందులను అరికట్టాలన్నారు. రైతులు తీసుకున్న అన్ని రకాల అప్పులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌వో వెంకటనారాయణమ్మకు వినతి పత్రం అందజేశారు. నాయకులు పి.రామక్రిష్ణారెడ్డి, డి.శ్రీనివాసరావు, బీసన్న, నాగరాజు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించకుంటే చర్యలు

సి.బెళగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయం పాటించకుంటే చర్యలు తప్పవని డిప్యూటీ ఎంపీడీవో షాషావలి హెచ్చరించారు. బుదవారం మండల కేంద్రంలోని 1, 2 సచివాలయాలను తనిఖీ చేశారు. సిబ్బంది ఇష్టానుసారంగా రావడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి విధులకు అలస్యంగా వస్తే జిల్లా ఉన్నతాదికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్యామల ఉన్నారు

పెద్దాసుపత్రిలో నిలిచిన ఎంఆర్ఐ సేవలు



ఎంఆర్ఐ స్కానింగ్ కోసం వేచి ఉన్న రోగులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రెండు రోజులుగా ఎంఆర్ఐ (మాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్) సేవలు అందక రోగులు ఇబ్బంది పడుతున్నారు. సర్వర్ మొరాయించడంతో కొత్త కేసులను సిబ్బంది తీసుకోవడం లేదు, ఇప్పటికే రిజిస్ట్రేషన్ అయిన పాత కేసులను మాత్రమే చేస్తూ కొత్త కేసులను వెనక్కు పంపుతున్నారు. ఆసుపత్రిలో ఎంఆర్ఐ సేవలను పీపీపీ కింద విజయవాడకు చెందిన ప్రమోదీని మెడికల్ కేర్ నిర్వహిస్తుంది. రోజూ దాదాపు 70 మంది రోగులకు ఎంఆర్ఐ పరీక్షలు నిర్వహిస్తారు. న్యూరోసర్జరీ, న్యూరాలజీ, మెడికల్ సర్జరీ, ఆర్థో, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాల నుంచి రోగులు ఎక్కువగా వస్తుంటారు. రెండు రోజులుగా నూతన కేసులు తీసుకోకపోవడంతో దాదాపు 150 మంది రోగులు ఎదురు చూస్తున్నారు. అధికారులు స్పందించి సర్వర్ సమస్యను పరిష్కరించి ఎంఆర్ఐ పరీక్షలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

ఆదోని జిల్లా కోసం కదం తొక్కిన ప్రజానీకం



ర్యాలీ చేస్తున్న నాయకులు



జేఏసీ నాయకులతో చర్చిస్తున్న ఉమాపతి నాయుడు



ర్యాలీ చేస్తున్న టీడీపీ యువ నాయకులు, కార్యకర్తలు

ఆదోని/ ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆదోని జిల్లా సాధనకు ప్రజలందరూ కదనరంగంలోకి దిగారు . యావత్ ప్రజానీకం రోడ్లపైకి వచ్చి జిల్లా సాధనే తమ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసేలా గర్జించింది.. బుధవారం జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు పిలుపునిచ్చిన బంద్ విజయవంతం అయింది. స్వచ్ఛందంగా దుకాణాలు, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు, బ్యాంకులు, కార్యాలయాలు మూతపడ్డాయి. తెల్లవారుజాము అయిదు గంటలకే జేఏసీ నాయకులు ఆర్టీసీ డిపో వద్దకు చేరుకున్నారు. ఆర్టీసీ బస్సులు రోడ్డు ఎక్కకుండా అక్కడే బైఠాయించారు



బస్సులను అడ్డుకుంటున్న జేఏసీ నాయకులను నివారిస్తున్న పోలీసులు



25వ రోజు దీక్షలో పాస్టర్లు



పాల్గొన్న వివిధ పార్టీలు, సంఘాల నాయకులు



ఆదోనిలో మూతపడ్డ దుకాణాలు



ర్యాలీగా వస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆలూరు ప్రాంత అభివృద్ధికి కృషి

● సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ



సీసీ రోడ్డను ప్రారంభిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

ఆలూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆలూరు ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. బుధవారం సాయంత్రం మొలగవల్లి గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఆలూరు ప్రాంత అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబునాయుడిని, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ముస్లింల కోసం షాదీఖానా నిర్మాణానికి మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో చర్చిస్తానన్నారు. కార్యక్రమంలో మొలగవల్లి లక్ష్మిరెడ్డి, సర్పంచ్ మోహన్‌రాజ్, వైస్ ఎంపీపీ కురువ శ్రీరాములు, అశోక్‌యాదవ్, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, భూపేష్, డీలర్ వెంకటేశ్వర్లు, కాక రంగస్వామి, చిన్న ఈరన్న, బంగారు రామకృష్ణ, పూల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'భూమి కబ్జా చేశారు'

మద్దికెర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో తమ భూమిని కబ్జా చేశారనీ.. అదే గ్రామానికి చెందిన పాటిల్ సత్యమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తహసీల్దార్ గూండాల్ నాయక్‌కు అన్ని వివరాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఎడవలి గ్రామంలో రెండెకరాల పొలం పూర్వం నుంచి తమ ఆధీనంలో ఉందని, తాము ముగ్గురు వారసులమని, సదురు భూమిని తమ బంధువు అయిన శ్రీనివాసరెడ్డి తన పేరు మీద ఎక్కించుకుని అన్యాయం చేశాడని వాపోయారు. తమ పెద్దలు ఆ భూమిలో 50 సెంట్లు క్రిస్టియన్ శ్మశాన వాటికకు ఇచ్చారని ఆ స్థలం కూడా కబ్జా చేశాడన్నారు. వారసులం ఉన్నా రెవెన్యూ అధికారులు శ్రీనివాసరెడ్డితో కుమ్మక్కై అతని పేరు మీదకు మార్చారని, శ్రీనివాసరెడ్డి ఇతరులకు అమ్మి ప్లాట్లు కూడా వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ గూండాల్ నాయక్ మాట్లడుతూ గ్రామానికి వెళ్లి ఆ పొలంను పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

తుగ్గలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సుశీల నేత్రాలయ, సాయి సొసైటీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఏపీ ఫైబర్ కేబుల్ ఆపరేటర్ దూదేకుల పులిమాబు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని జొన్నగిరిలో ఆయన మాట్లాడుతూ జొన్నగిరి పాత పంచాయతీ కార్యాలయం వద్ద కర్నూలు సుశీల నేత్రాలయ వైద్యబృందంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని, కంటి వ్యాధులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ వైద్యశిబిరానికి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకోవాలని, అవసరమైతే మందులు, అద్దాలు పంపిణీ చేస్తారని తెలిపారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా నిర్వహిస్తారన్నారు. వైద్యశిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా

చిప్పగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్డోన గ్రామంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామని ఆ గ్రామ సర్పంచ్ కరివేముల సావిత్రి, సీనియర్ టీడీపీ నాయకులు బెల్డోన గోవిందు అన్నారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేంద్ర ఆధ్వర్యంలో గ్రామంలో ట్యాంకర్‌లను ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరా చేశారు. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతూ ఉంటే తమదృష్టికి తీసుకురావాలని, తక్షణమే ట్యాంకర్ల తాగునీటిని సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ సావిత్రి, బెల్డోనా గోవిందు దంపతులు వివరించారు. సీనియర్ నాయకులు, సర్పంచ్ సావిత్రి, నాయకులు గోపాల్, యువ నాయకులు గోవర్ధన్ పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

వెల్దుర్తి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి.. తుపాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ రైతు సంఘం ఆధ్వర్యంలో పాతబస్టాండు రహదారిపై ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయ డీటీకి వినతి పత్రం అందజేశారు. సీపీఐ నాయకులు చిన్నమాదులు, డి.రాజు, పాల్గొన్నారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన వైసీపీ కన్వీనర్

చిప్పగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు చిప్పగిరి మండల వైసీపీ కన్వీనర్ జూటూరు మారయ్య తెలిపారు. మండలంలో పార్టీ పరిస్థితులపై చర్చించినట్లు తెలిపారు.

కొలిమి హుస్సేన్ పీరా మృతి

తుగ్గలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురంలో టీడీపీ సీనియర్ నాయకులు, మైనార్టీ సెల్ నాయకులు కొలిమి హుస్సేన్ పీరా (74) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి తీరని లోటు అని అని టీడీపీ మండల ఉపాధ్యక్షులు వెంకట్రాముడు చౌదరి, మార్కెట్ యార్డు డైరెక్టర్ భీమలింగప్ప చౌదరి అన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులతో పాటు మైనార్టీ నాయకులు, స్థానిక నాయకులు సర్పంచ్ లడ్డు కమల్, ఎంపీటీసీ పుష్పవతి, మల్లయ్య, మద్దిలేటి చౌదరి, వెంకటేశ్వర్లు హుశేన్ పాఠశాలలకు రూ.లక్షలు విలువ చేసే స్థలాన్ని అందించి విద్యాదాత పేరుగాంచారనీ, పాఠశాలను నిర్మించి కొన్ని వేల మంది విద్యార్థులకు విద్యనందించిన గొప్ప విద్యాదాత అన్నారు. గ్రామస్థులు మహ్మద్ రఫీ, గంగాధర్, గోవిందరాజులు, బద్రి తదితరులు ఉన్నారు.



కొలిమి హుస్సేన్ పీరా(ఫైల్)

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

ఆదోని రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అశాస్త్రీయమైన ఆదోని మండల విభజనను రద్దు చేయాలని, తమ గ్రామాలను ఆదోని మండలంలోనే కొనసాగించాలని గొనేహాళ్ గోపాల్‌రెడ్డి, గణేకల్ విరుపాక్షి, ఢణాపురం మాజీ సర్పంచ్ ఈరన్న గౌడ్, చిన్నహరివాణం మాజీ సర్పంచ్ సుజ్ఞామ్మలు డిమాండ్ చేశారు. గణేకల్, చాగి, చిన్నహరివాణం, నారాయణపురం, ఢణాపురం, కడితోట, బసాపురంతోపాటు 9 గ్రామాలను పెద్దహరివాణంలో కలపడాన్ని నిరసిస్తూ 16 గ్రామాల ప్రజలు బుధవారం పట్టణంలోని శ్రీనివాస్ భవన్ వద్ద ఉన్న అంబేద్కర్ కూడలి వద్దకు ర్యాలీగా వచ్చి ఆందోళన చేపట్టారు. అశాస్త్రీయమైన మండల విభజనను రద్దు చేయాలి డిమాండ్ చేస్తూ, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు.

పంచాయతీ కార్యాలయాల నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న వైకుంఠం జ్యోతి

దేవనకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంటుపల్లి, బేతపల్లి, బండపల్లి గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణాల కోసం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జీ వైకుంఠం జ్యోతి, వాల్మీకి చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ భూమి పూజ చేశారు. ఆయా గ్రామాలలో వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమీ సర్కారుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్, బడిగింజల రంగన్న, సర్పంచులు చిన్నరామప్ప, మహేశ్వరరెడ్డి, భాస్కర్, రాందాస్‌గౌడ్, మార్కెట్‌యార్డు చైర్మన్ బిల్లేకల్ వెంకటేష్, వైస్ చైర్మన్ రంగడు, శ్రీనివాసులుగౌడ్, రాజశేకర్‌గౌడ్, రామారావు నాయుడు, శాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

పత్తికొండ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో జరిగే సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రవిచంద్ర కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు.ఈ మహాసభలకు కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్, సీఐటీయూ జాతీయ నాయకులు పాల్గొంటారని, ఈ సభలకు పెద్ద ఎత్తున కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు శేఖర్, మాబు, గిరి, కాశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

ఆలూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆలూరు పట్టణ కేంద్రంలో ఉన్న బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం మొలగవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రవి ఆధ్వర్యంలో 230 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. విద్యార్థుల రక్తహీనత తెలుసుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా క్యాంపు ఏర్పాటు చేసినట్లు డాక్టర రవి తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జమ్మన్న, ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం, యంసీహెచ్ రజిత, కృపాస్వామి, ఉమా, ఏఎన్ఎం విజయలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ఆలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ఆలూరు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోనిని జిల్లాగా ప్రకటించాలనే డిమాండ్‌తో గురువారం ఆలూరు పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నాయకులు కత్తి రామాంజనేయులు, అశోక్, భూపేష్, స్వరూప్, రంజిత్ బుధవారం తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, ఉద్యోగ సంఘాలు, న్యాయవాదులు, జర్నలిస్టులు, అన్నివర్గాల ప్రజలు, వ్యాపారులు తప్పక హాజరుకావాలన్నారు. 12 నుంచి రిలే దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దేవనకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈదుల దేవరబండ వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు గాయపడ్డారు. పత్తికొండ నుండి కర్నూలుకు వెళ్తున్న టమోటా మినీలారీ, కర్నూలు నుండి బళ్లారి వైపు వెళ్లున్న లారీ ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకొంది. రెండు లారీల డ్రైవర్లుప్రమాదంలో గాయపడటంతో చికిత్సకోసం కర్నూలుకు తరలించారు. ప్రమాదసమయంలో లారీలోని టమోటా బాక్సులు కిందపడటంతో రోడ్డుపై టమోటాలు చెల్లాచెదురుగా పడ్డాయి.

మరొకరికి..

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెర గ్రామానికి చెందిన జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆర్.వెంకటేశ్వర్లు రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. బుధవారం ఆర్.వెంకటేశ్వర్లు తన సొంత పని నిమిత్తం ద్విచక్రవాహనంలో వెళ్తుండగా.. గ్రామ శివారులోని భీమలింగప్ప వ్యవసాయ తోట వద్ద కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమ్మితం గుంతకల్లు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, జడ్పీటీసీ సభ్యులు డి.మురళీధర్ రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షులు మల్లికార్జున యాదవ్ పరామార్శించారు.

ప్రశాంతంగా నెట్టేకల్ దేవర

ఆదోని రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం నెట్టేకల్‌లో రెండురోజులపాటు జరిగిన పెద్దమ్మవ్వ, సుంకలమ్మవ్వల దేవర ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసాయి. బుధవారం ఉదయం నుంచే అమ్మవారి దేవాలయాలకు ప్రతి ఇంటి నుంచి మహిళలు కుంభాలతో బయల్దేరి నైవేద్యం సమర్పించారు. గ్రామ ప్రజలు, వారి బంధువులతో గ్రామమంతా సందడి వాతావరణం నెలకొంది. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాలుక సిఐ నల్లప్ప ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

విద్యుత్ అధికారులు.. మీటర్లు తీసుకెళ్లారు..

మద్దికెర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో జగనన్న కాలనీలో నివాసం ఉండే 15 మంది లబ్ధిదారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మీటర్లను తీసుకెళ్లారనీ ఎడవలి గ్రామస్థులు తిమ్మారెడ్డి, వెంకటేష్, వలి, నాగరాజు, మస్తాన్, రమేష్‌లు ఆరోపించారు. 4 సంవత్సరాల క్రిందట జగనన్న కాలనీలో గృహాలు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నామని, తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మీటర్లను తీసుకెళ్లడంతో గాఢాంధకారంలో ఉండాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ మాట్లాడుతూ ఎడవలి గ్రామంలోని జగనన్న కాలనీలో 15 మంది ఎలాంటి ఆధార్ కార్డులు ఇవ్వకుండా మీటర్లు బిగించుకున్నారని, డిపాజిట్ చెల్లించిన వెంటనే వారికి కొత్త మీటర్లు ఇస్తామని తెలిపారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

●ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రామదుర్గం సొసైటీ చైర్మన్

చిప్పగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థికాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని రామదుర్గం సహకార పరపతి సంఘం చైర్మన్ లక్ష్మీకాంత్ అన్నారు. బుధవారం చైర్మన్‌గా లక్ష్మీకాంత్, డైరెక్టర్లుగా పరమేష్, మునలప్ప ప్రమాణ స్వీకారం చేశారు. తనకు అవకాశం కల్పించిన టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతికి ధన్యవాదాలు తెలిపారు

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

తుగ్గలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి మండలం వెనుకబడిన ప్రాంతమనీ.. విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ప్రతాప్ యాదవ్ సమగ్రశిక్ష అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డా.లోక్‌రాజును విజ్ఞప్తి చేశారు. బుధవారం కర్నూలులో ఆయన కార్యాలయంలో శ్రీవల్లి రూరల్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు ప్రతాప్ యాదవ్ కలిసి తుగ్గలి మండల సమస్యలను వివరించారు.

వ్యవసాయంపై అవగాహన ఉండాలి

మద్దికెర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చదువుకునే విద్యార్థినీ విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన ఉండాలని జిల్లా భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ విస్తరణాధికారులు మహ్మద్ హసీఫ్ భాషా, శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్షల ఆవశ్యకతపై మండల వ్యవసాయాధికారి రవి అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ సైన్స్ టీచర్ షీయాంజ్ బాను, కార్తిక్, తదితరులు ఉన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి విళక్కు పూజ



కలశాలతో పాల్గొన్న చిన్నారులు

దేవనకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవనకొండలో అయ్యప్పస్వామి విళ్లక్కు పూజ వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం అయ్యప్ప 18 మెట్లు, విగ్రహాన్ని ఊరేగించారు. అయ్యప్పస్వాములతో పాటు చిన్నారు, మహిళలు కలశాలతో గ్రామంలో ఊరేగింపు చేశారు. ఆలయ నిర్వహకులు వేణుకుమార్, జెడ్పీటీసీ రామకృష్ణ, గ్రామస్తులు వేణు, శివ, ఆంజీ, తదితరులు పాల్గొన్నారు.

' కుడా ' అనుమతి తీసుకోవాలి

వెల్దుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తి గ్రామంలో బుధవారం కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ (కుడా) చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పర్యటించారు. వెల్దుర్తిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్న భవనాలకు, అక్రమ లేఅవుట్‌లు వేసిన వారికి నోటీసులు మంజూరు చేయాలని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్‌ను ఆదేశించారు. లేఅవుట్ వేసే రియల్ ఎస్టేట్‌దారులు తప్పనిసరిగా కూడా అనుమతులు తీసుకోవాలని సూచించారు. అనుమతులు లే నివాటిని కూల్చివేస్తామని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

తుగ్గలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పగిడ్యాలలో జరిగిన జిల్లా స్థాయి అండర్-18 ఖో-ఖో పోటీల్లో తుగ్గలి విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికయ్యారనీ పీఈటీల సంఘం జిల్లా కార్యదర్శి చందు నాయక్ తెలిపారు. బుధవారం రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికైన హరికృష్ణ, సాయి, వంశీ అనే విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. అగస్టీన్, ఉపాద్యాయులు ఉన్నారు.

మేము నిర్మిస్తే మీరు గొప్పలు చెప్పకుంటున్నారు

ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి



జెండా ఊపి వాహనాన్నిపంపుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన, నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ భవనాలను కూటమి నాయకులు గొప్పలు చెప్పుకుంటూ.. ఆరంభించడం సిగ్గు చేటని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. బుధవారం ఆలూరు ఆర్అండ్‌బి అతిథి గృమంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ రద్దుపై నియోజకవర్గంలో సేకరించిన కోటి సంతకాల పత్రాలను జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక వాహనంలో పంపించారు. సమావేశంలో జెడ్పీటీసీ కిట్టు, మండలాల కన్వీనర్లు మల్లికార్జున, షఫీ ఉల్లా అరికెర వెంకటేశ్వర్లు, చిన్న ఈరన్న, పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ పత్తికొండ నియోజకవర్గంలో చేపట్టిన 62 వేల సంతకాల ప్రతులను మాజీ ఎమ్మెల్యే స్వగృంలో బుధవారం జిల్లా కేంద్రానికి తరలించే ప్రత్యేక వాహనాన్ని మాజీ ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, ఎంపీపీ నారాయణదాస్, నాయకులు శ్రీరంగడు, సోమశేఖర్, సర్పంచ్ కొమ్ముదీపిక, హోటల్ రామచంద్ర, బాపులదొడ్డి నాగరాజుయాదవ్, నరసింహ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

మాన్యువల్ పట్టాలతో మోసపోకండి: ఆర్డీవో

పత్తికొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలం మండగిరి గ్రామ సర్వే నెంబరు 616-2లో లబ్దిదారులెవరికీ ఎవరిక ఆన్‌లైన్ పట్టాలు మంజూరు చేయలేదని ఆర్డీఓ భరత్‌నాయక్ ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన దర్జాగా కబ్జా కథనానికి స్పందించిన ఆయన విలేకరులతో మాట్లాడారు.

సదరు సర్వేనెంబరులో ఎవరికి ఆన్‌లైన్ పట్టాలు మంజూరు చేయలేదని అక్కడ పట్టాల పేరుతో బండలు నాటుతున్న సంఘటనపై విచారణ చేపడుతునామని ఆ నివేదికల ఆధారంగా ముందుకు సాగుతామన్నారు. 306-3, 306-4 ప్రభుత్వ స్థలాల్లో కబ్జాలపై త్వరలో విచారణ చేపట్టి అక్రమాలు వెలికి తీస్తామని అన్నారు. 616-2 సంబంధించి నివేదికల ఆధారంగా అందులో పాతిన బండలను తొలగించి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో

రెండు రోజుల్లో బండలను తొలగిస్తాం: మండగిరి సర్వేనెంబరు 616-2లో ఎలాంటి ఆన్‌లైన్ పట్టాలు మా కార్యాలయం నుంచి మంజూరు చేయలేదు. మాన్యువల్‌గా 22 పట్టాలను గతంలో పనిచేసిన అధికారులు మంజూరయినట్లు గుర్తించాం. ఈ విషయాలన్నింటిని డివిజన్, జిల్లా అధికారులకు నివేదికలు పంపాం. అక్రమంగా ఆ స్థలంలో నాటిన బండలను తొలగించాలని ఆదేశాలు ఇచ్చాం. రెండు రోజుల్లో తొలగించకపోతే పోలీసు బందోబస్తు నడుమ బండలను తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం.

-హుసేన్ సాహెబ్,తహసీల్దార్

ఆదోని జిల్లా కోసం రిలే దీక్షలు

● మద్దతు తెలిపిన ప్రజా సంఘాలు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆదోని జిల్లాగా ప్రకటించాలని ఆదోని జిల్లా సాధన జేఏసీ గౌరవ అధ్యక్షుడు కమలే గణేష్, జేఏసీ నాయకులు సత్యనారాయణ రెడ్డి, మల్లెల అల్ఫ్రెడ్ రాజు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలోని కర్నూల్‌లోని పశ్చిమ ప్రాంతమైన ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని పత్తికొండ, అలూరు, మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాలలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నారన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఆదోనిని జిల్లాగా ప్రకటించకుండా ఉండడం దారుణమన్నారు. ఆదోని జిల్లాగా ప్రకటిస్తే పశ్చిమ ప్రాంతం లో మెరుగైన విద్య, వైద్యం, సాగు, తాగు నీరు, పరిశ్రమలు అందుబాటులోకి వస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేసి పశ్చిమ ప్రాంతంలోని ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల, వేదావతి ప్రాజెక్టులను పూర్తి చేసి అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలన్నారు. రిలే నిరాహార దీక్షకు ప్రజా సంఘాలు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులు ప్రసాద్, సీపీఐ ప్రధాన కార్యదర్శి రంగన్న, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణలు మద్దతు తెలిపారు. జేఏసీ నాయకులు శేఖర్, ఉదయ్, కృష్ణ, ఆఫ్రీది దీక్షలో పాల్గొన్నారు.

కలిసికట్టుగా పోరాడుదాం

కౌతాళం: ఆదోని జిల్లా సాధించేందుకు అందరం కలిసి కట్టుగా పోరాడుదామని జేఏసీ నాయకులు మారుతీ మోహన్, జగదీష్, లక్ష్మణాచారి అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో బుధవారం జిల్లా సాధన కోసం ఆదోనిలో చేపట్టిన సమైక్య బంద్‌కు మద్దతుగా గ్రామంలో అన్నిపార్టీల నాయకులు, విద్యార్థి సంఘాలు, విద్యా సంస్థలు, వ్యాపారులతో కలిసి మండల జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి మద్దతు తెలిపారు. ఎ.స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీని మారుతీమోహన్ వివిధ పార్టీల నాయకులు జండా ఊపి ప్రారంభించారు. సాధిద్దాం..సాధిద్దాం ఆదోని జిల్లాను సాధిద్దాం అంటూ నినాదాలు చేస్తూ గ్రామంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్‌లో గంట పాటు రస్తారోకో చేసి జిల్లా సాధనకోసం నిరసన తెలిపారు. ఖాదర్‌లింగ స్వామి దర్గా ధర్మకర్త పెద్దమున్నా సాహెబ్, సర్పంచ్ పాల్‌దినకరన్, వివిధ పార్టీల నాయకులు ప్రహ్లాదాచారి, కాశీవిశ్వనాథ్, దాట్ల సుబ్బారాజు, రాజబాబు, విజయ్, సక్రి తిక్కయ్య ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ దూద్‌భాష, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు లింగన్న, జాబీర్ నాయకులు అవతారం, సిద్దు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో రిలే నిరాహార దీక్షలో కూర్చున్న జేఏసీ నాయకులు



కౌతాళంలో రాస్తారోకో చేస్తున్న జేఏసీ నాయకులు, విద్యార్థులు

కందుకూరులో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో..

కోసిగి: ఆదోనిని జిల్లా చేయాలని కోరుతూ కోసిగి మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. గ్రామంలోని వీధుల గూండా ర్యాలీ నిర్వహించారు. పాఠశాలను బంద్ చేయించి ఆదోని జిల్లా చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఎం తిక్కయ్యకు వినతి పత్రం అందజేశారు.

పెద్దకడబూరు: ఆదోని జిల్లా అయితే ప్రజలకు మెరుగైన పాలన, సౌకర్యాలు అందుతాయని దొడ్డిమేకల గ్రామస్థులు విరుపాక్షి, వీరేష్, గిడ్డయ్య అన్నారు. బుధవారం మండలంలోని దొడ్డిమేకల గ్రామంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో బజారి, మహేష్, రామాంజినేయులు, శివరాం, హనుమేష్ పాల్గొన్నారు.



కందుకూరులో ధర్నా చేస్తున్న పూర్వ విద్యార్థులు, దొడ్డిమేకలలో నిరసన తెలియజేస్తున్న గ్రామస్థులు

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

● పాల్గొన్న పీఠాధిపతులు


హోమం చేస్తున్న పీఠాధిపతులు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

కోసిగి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరులో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో నూతనంగా దేవమ్మవ్వ, పద్దమ్మవ్వ, మారెమ్మ దేవి అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠాపన బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి వేర్వేరు సమయాల్లో వేడుకల్లో పాల్గొన్నారు. తవేరా దేవర సంస్థాన మఠం బిచ్చాలి పీఠాధిపతి శివాచారి మహాస్వామి, శరణగిరి సంస్థాన మఠం హాల్వి పీఠాధిపతి అభినవ మహాంత మహాస్వామి, సోమవార పీఠే హిరేవాట రాయచూరు పీఠాధిపతి అభినవ రాచోటి వీరశివచార్య మహాస్వామి పీఠాధిపతులు పాల్గొని ప్రత్యేక హోమాలు, పూజలు చేశారు. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డికి మఠం పీఠాధిపతులు పూలమాలలు, శాలువాలతో సన్మానించి ఆశీర్వాదాలు అందజేశారు. గ్రామ పెద్దలు బెట్టన్నగౌడు, శరణప్ప గౌడు, టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, నాడిగేని అయ్యన్న, చింతలగేని నర్సారెడ్డి, రామకృష్ణ, వక్రాణి వెంకటేశ్ పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో మంత్రాలయం పీఠాధిపతి


తిరుమలలో మంత్రాలయం పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

మంత్రాలయం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు బుధవారం తిరుమలలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. బుధవారం ఆలయ మహాముఖ ద్వారంవద్ద టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అడిషనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకయ్య చౌదరి, టీటీడీ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, మంగళవాయిద్యాల మధ్య ఘనంగా స్వాగతం పలికారు. పీఠాధిపతికి స్వామివారి వస్త్రం, ప్రసాదమిచ్చి సన్మానించారు. మఠం దివాన్ శ్రీనాథ్ ఆచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, తంబి స్వామి, రాజా ఎస్ అప్రమేయాచార్, కృష్ణ కౌశిక్, శ్రీష జోయిష్, రవికులకర్ణి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దేశాయి మాధవరావు

నందవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక ధృడత్వంతో పాటు మానసికోల్లాసాన్ని ఇస్తాయని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు అన్నారు. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా బుధవారం మండలంలోని సజీవపురంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి కాసేపు క్రికెట్ ఆడారు. క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఆర్గనైజర్లు ఎజ్కేల్, దావీదు మాట్లాడుతూ ప్రస్తుతం 40 జట్లు పాల్గొన్నాయి. ఆసక్తి గల క్రీడారులు సెల్ నెం: 9391689350, 7013755717కు సంప్రదించాలన్నారు. గెలుపొందిన మొదటి జట్టుకు రూ.25,000, రెండవ బహుమతి రూ.15,000. దేశాయి మాధవరావు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. టీడీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, గజేంద్రరెడ్డి, పల్లె నాగేంద్రప్ప, తెలుగు యువత అధ్యక్షుడు ఈరన్న, మల్లికార్జున, బెస్త ఈరన్న, పంపయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గృహాలు లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు

● మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి


సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని శివన్ననగర్‌లో నిర్మించిన టిడ్కో గృహాల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. బుధవారం టిడ్కో గృహాల సముదాయంలో కమిషనర్, డీఈఈ నీరజ, సిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివన్న నగర్ ప్రాంతంలో 4272 గృహాల్లో ఇప్పటికే 2000గృహాలు లబ్ధిదారులకు అందించామన్నారు. వీరి వెంట టిడ్కో డీఈఈ విక్టర్ బాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పంటలకు అందని భాస్వరం

రంగు మారుతున్న మొక్కజొన్న ● ఏడీఏ మహ్మద్ ఖాద్రీ

గోనెగండ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చలి పెరగడంతో పొలాల్లో భాస్వరం ఉన్నప్పటికీ అది పంటలకు అందడం లేదని ఏడీఏ మహ్మద్ ఖాద్రీ అన్నారు. బుధవారం ఏవో హేమలతతో కలిసి ఆయన మండలంలోని పలు గ్రామాల్లో వారు పర్యటించి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖాద్రీ మాట్లాడుతూ ఉదయం పూట పొలాలలో పొగ మంచు ఎక్కువగా కమ్ముకుంటుందన్నారు. భాస్వరం లభ్యం కాని కారణంగా మొక్కజొన్న పంట ఊదరంగులోకి మారిపోతుందన్నారు. మొక్క ఎదుగుదల నిలిచిపోవడం చిన్నగా, బలహీనంగా కనిపిస్తుందని, ఆకు అంచున ఎండినట్లు కనిపిస్తుందన్నారు. ఇందుకుగాను డీఏపీ లేదా 19:19:19 అనే ఎరువు 10 గ్రాములు లేదా నానో డీఏపీ రెండు మిల్లీ లీటర్లును ఒక లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు మార్లు పిచికారి చేయాలన్నారు.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య హెచ్చరించారు. బుధవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక సోమప్ప సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన 50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పిందన్నారు. అందుకు 6.70లక్షల గోనెసంచులను అందుబాటులో రైతులకు ఉంచుతామని చెప్పి చేతులెత్తేసిందన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసే సమయంలో తేమశాతం ఎక్కువగా ఉందని, రంగు మారిందని అనేక కొర్రీలు పెడుతున్నారన్నారు. రోజురోజుకు రైతుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని, వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోతుందన్నారు. రైతులను ఆదుకోకపోతే ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, కేసీ జబ్బార్, బీటీ చినన్న, మద్దిలేటి నాయుడు, రాజీవ్, గిడ్డయ్య మాలిక్, రంగస్వామి, నరసప్పలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకులు

ఘనంగా మారెమ్మ దేవర

కోసిగి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామన్‌దొడ్డిలో బుధవారం ఘ నంగా మారెమ్మ దేవర వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామ ప్రజలు పెద్దఎత్తున మారెమ్మకు పూజలు చేసి పిండి వంటలతో మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి ప్రతి ఇంటి నుంచి మహిళలు నైవేద్యాలతో కూడిన పూర్ణ కుంభాలతో మారెమ్మ దేవాలయం వరకు ర్యాలీగా వెళ్లి అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, యువ నాయకులు రాజారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వీరికి టీడీపీ నాయకులు మామల్లి దొడ్డయ్య, మామల్లి వీరేష్, వెంకన్న పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ము త్తురెడ్డి, రామిరెడ్డి, నాడిగేని అయ్యన్న, చింతలగేని నర్సారెడ్డి, తోవి రామకృష్ణ, వక్రాణి వెంకటేశ్, కోసిగయ్య, గోపాల్ రెడ్డి, ఈరయ్య, గాలెం వీరేష్, సొట్టయ్య పాల్గొన్నారు.

కౌతాళం: గ్రామదేవత మారికాంబదేవి దేవర బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని రౌడూరు, పొదలకుంట, గోతులదొడ్డి గ్రామాల్లో గ్రామ దేవత మారికాంబదేవి ఉత్సవాలు గ్రామస్థులు, భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి, ఆయా గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి తరువాత దేవర ఉత్సవాలను ప్రారంభించారు. బుధవారం తెల్లవారుజామున నుంచే ఆయా గ్రామాలలో ఉదయం, కాత్రికిలో సాయంత్రం అమ్మవార్లకు మహిళలు కుంభాలతో అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ దేవర జరుగు గ్రామాలలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు స్థానిక నాయకులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు.ఆయా గ్రామాల నాయకులు ఘనస్వాగతం పలికి పూలమాలు వేసి సన్మానించి అమ్మవార్ల సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కౌతాళం సీఐ అశోక్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


మారెమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న రాఘవేంద్ర రెడ్డి

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

కోసిగి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన ఉల్లి, పత్తి రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని ఏపీ రైతు సంఘం ఏఐకేఎస్ మండల కార్యదర్శి తాయన్న అన్నారు. బుధవారం కోసిగిలోని రైతు సేవా కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి గోపాల్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు అన్నదాత సుఖీభవ రూ.20వేలు విడుతల వారిగా రైతుల ఖాతాలో జమ చేస్తుందని, అలా కాకుండా ఒకేసారి రూ.20వేలు రైతులకు అందించాలని వారు డిమాండ్ చేశారు వినతి పత్రాన్ని వ్యవసాయ శాఖ అధికారులకు అందజేశారు. నాయకులు ఓంకార్‌స్వామి, పరుశురాం, సిద్దప్ప, వీరేష్, నరసింహులు, అల్లయ్య, గుండయ్య, చార్లెస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలుచేయాలని, వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి గోవర్దన మ్మ, సీఐటీయూ మండల అధ్యక్షుడు గోవిందు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంగన్‌వాడీ కార్యాలయంలో సీడీపీవో వినతిపత్రం అందించారు. అనం తరం వారు విలేకరులతో మాట్లాడారు. బాలింతలకు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అనేక సేవలు అందిస్తున్న ప్రభుత్వం మాత్రం వారిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. 2019 నుంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదని, ఇందుకొసం 2023 డిసెంబరు 42రోజుల పాటు సమ్మె నిర్వహించామన్నారు. సమ్మె విరమణ సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్‌లో సంతకాలు చేసినా నేటివరకు వాటి ఊసే లేదన్నారు. గురువారం కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని తెలిపారు. నాగ శిరోమణి, నాగలక్ష్మీ, రామేశ్వరి, రాజేశ్వరి పాల్గొన్నారు.


సీడీపీవోకు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

బ్రేక్ ఫెయిలైన పత్తి లారీ

● తప్పిన ప్రమాదం


రైల్వేగేటు ముందు నిలిచిపోయిన పత్తిలోడు లారీ

కోసిగి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలోని రైల్వేగేటు సమీపంలో మహారాష్ట్రకు చెందిన పత్తి లారీ బ్రేక్ ఫెయిలై భారీ ప్రమాదం తప్పింది. బుధవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో పత్తి లోడుతో ఉన్న లారీ బ్రేక్ ఫెయిలైంది. డ్రైవర్ చాకచక్యంగా లారీని రైల్వేగేటు పక్కన నిలిపివేశాడు. అక్కడ మూడు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

భీమయ్య మృతి పార్టీకి తీరని లోటు

మంత్రాలయం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గుడిసె భీమయ్య (62) మృతి పార్టీకి తీరని లోటని పట్టణ అధ్యక్షుడు వరదరాజులు, ఎంపీటీసీ మేకల వెంకటేష్, అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం నియోజ కవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు భీమయ్య భౌతికాయానికి నివాళుల ర్పించారు. రూ.5 వేలు ఆర్థికసాయాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. నాయకులు ఆర్‌కే రఘు, స్కూల్ చైర్మన్ నరసింహులు పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీ కార్యాలయంలో కూలిన పైకప్పు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు సబ్ ట్రెజరరీ కార్యాలయంలో పైకప్పు కూలింది. బుధవారం ఉదయం 12గంటల సమయంలో కార్యాలయంలో ఉద్యోగులందరూ విధుల్లో ఉన్నారు. సబ్‌ట్రెజరరీ ఆఫీసర్ గదిలో ఉన్న పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో సబ్ ట్రెజరరీ రఘునందన్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. ఆయన మాట్లాడు తూ కార్యాలయం ఏర్పాటు చేసే చాలా సంవత్సరాలైందని, దీంతో పైకప్పు పెచ్చులూడుతుందన్నారు. పైకప్పు తన కాళ్ల ముందు పడడం తో ప్రమాదాన్ని తప్పించుకున్నానన్నారు.


సబ్ ట్రెజరీ కార్యాలయంలో పైకప్పు కూలిన దృశ్యం

స్కూల్ బస్సులను తనిఖీ చేయించుకోవాలి

● ఆదోని ఎంవీఐ సిసిరా దీప్తి

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆదోని ఆర్టీవో కార్యాలయంలో స్కూల్ యాజమాన్యం తమ బస్సులను అధికారులతో తనిఖీలు చేయించుకోవాలని ఆదోని ఎంవీఐ సిసిరా దీప్తి అన్నారు. బుధవారం పట్టణ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా గత నెల 28వ తేదీన మంత్రాలయం రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించిన వాహనాన్ని పరిశీలించారు. ఆమె విలేకరులతో మా ట్లాడుతూ ఎమ్మిగనూరు ప్రాంతంలో ఉన్న స్కూల్ యజమానులందరికీ నోటిసులు జారీ చేశామన్నారు. వారి బస్సులకు సంబంధించిన ఫిట్‌నెట్ పత్రాలతో 15రోజులలోపు ఆదోని ఆర్టీవో కార్యాలయములో బస్సులను తనిఖీ చేయించుకోవాలని, లేనిపక్షంలో బస్సులను సీజ్ చేస్తామన్నారు.


మాట్లాడుతున్న ఎంవీఐ సిసిరా దీప్తి

దివ్యాంగుల హక్కుల సాధనకు సహకరించాలి

● ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గోపి

నందవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల సాధనకు సహకరించాలంటూ ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గోపి, జిల్లా సీనియర్ నాయకులు సుబాష్ చంద్ర, నందవరం మండల అధ్యక్షుడు పెద్దయ్య, మంత్రాలయం ఇన్‌చార్జ్ ముగతి ప్రతాప్ అన్నారు. బుధవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో చేపడుతున్న వికలాంగుల సభను జయప్రదం చేసి తమకు సహకరించాలంటూ టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాదవరావు, సహకార సంఘం కార్యాలయం దగ్గర మండల సహకార సంఘం అధ్యక్షుడు దర్శాపురం గోపాల్, కాశీంవలీలకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన దివ్యాంగులకు త్రీ వీలర్ వాహనాలు ఎలాంటి వయస్సు, విద్యార్హత సంబంధం లేకుండా ఇవ్వాలన్నారు. ఈ నెల 13న ఎమ్మిగనూరులో నిర్వహించే దివ్యాంగుల సభకు అందరూ వచ్చి జయప్రదం చేయాలన్నారు.

ప్రైవేటీకరణను ప్రజలు వ్యతిరేకిస్తున్నారు: ఎమ్మెల్యే

మంత్రాలయం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. బుధ వారం మండలంలోని రాంపురంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రెండు నెలలుగా నియోజకవర్గంలో ప్రజలనుంచి సేకరించిన 50వేల సంతకాలును పార్టీ అధిష్టానానికి పంపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ మెడకల్ కళాశాలలు కాపాడుకునేందుకు స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు వస్తున్నారన్నారు. వైసీపీ మండల అధ్యక్షుడు గురెడ్డి భీమిరెడ్డి, ధశరథరెడ్డి, వెంకటరామిరెడ్డి, నాలుగు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మంత్రాలయంలో 50వేల పత్రాలను చూపుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రతులను వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయానికి తరలించినట్లు ఎమ్మిగనూరు వైసీపీ ఇన్‌చార్జి రాజీవ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. వైద్యం, విద్య ప్రభుత్వ బాధ్యత అని, ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవడం మన బాధ్యతగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ కోటి సంతకాల సేకరణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రఘు, గడ్డం నారాయణ, యంపిపి కేశన్న, బజారి, భీవిరెడ్డి పాల్గొన్నారు.

రైతు రుణాలను మాఫీ చేయాలి: సీపీఐ



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

మంత్రాలయం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతన్నల రుణాలను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యాదర్శి భాస్కర్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుదవారం ఆపార్టీ మండల కార్యాదర్శి లక్ష్మన్న నాయక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా రైతులు పెట్టిన పెట్టుబడి రాక దిగుబడి వచ్చిన పంట ఉత్పత్తులకు మద్దతు ధరలు లేక చాలా మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. నాయకులు గాబ్రియోల్, రాము, భీమన్న, వీరన్న, బీరప్ప, పక్కీరన్న పాల్గొన్నారు.